


సోమశిలకు 11,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, ఆగస్టు 10: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి 15.733 టీంఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. ఎగువ నుంచి 11,290 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన మరో మంత్రి నారాయణ, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకూ సాగునీరు ఇస్తాం!

వ్యవసాయానికే పెద్ద పీట

చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ రంగానికే పెద్ద పీట వేస్తోందని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించి రైతుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అధికారులు మండల సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలని, ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు.



జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, అలాగే వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం అన్ని మండల కేంద్రాల్లో శీతల గిడ్డంగులు నిర్మాణానికి, ఉద్యాన పంటల్లో కొబ్బరిని జోడించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో కొబ్బరి సాగు పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంట కాలువల్లో పూడిక తీత తీయిస్తామని, ఆయకట్టు స్థిరీకరణ చేపడతామని నారాయణ స్పష్టం చేశారు.

- మంత్రి నారాయణ





- సాగునీటి ఇబ్బందులు రానీయొద్దు!
- ఇరిగేషన్ అధికారులతో మంత్రి ఆనం

ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

'సోమశిల' రక్షణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి!

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 10 : సోమశిల జలాశయం రక్షణ పనులను యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. అలాగే జిల్లాలో సాగునీటి పంపిణీ వ్యవస్థను మెరుగుపరచి రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి, సాగునీటి కాలువల స్థితిగతులపై సోమశిల, కండలేరు, తెలుగుగంగ ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులతో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్‌లతో కలిసి మంత్రి ఆనం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ సోమశిలకు నీళ్ల వచ్చేలోగా అప్రాన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాంట్రాక్టర్ చేత పనులు వేగవంతం చేయించాలని సూచించారు. సోమశిల అభివృద్ధి పనులకు సరిపడా ఇసుకను ముందుగానే సిద్ధం చేసుకుని స్టాకుపాయింట్‌లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పంట కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి రైతాంగానికి సాఫీగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెన్నానది గతంలో దెబ్బతిన్న కట్టలను గుర్తించి ఇసుక బస్తాలు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పూడ్చాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా ఈ పని జరిగిపోవాలని సూచించారు. సోమశిల జలాశయం రక్షణ పనులను యుద్ధప్రాతి పదికన చేపట్టాలని ముఖ్యంగా గేట్ల రోప్, హెడ్‌రెగ్యులేటర్ పనుల మంజూరుకు సంబం ధించి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, ఆర్థికశాఖ కార్యదర్శులతో మంత్రులు ఆనం, నారాయణలు ఫోన్‌లో మాట్లాడి త్వరగా అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, ఇరిగేషన్ ఎస్‌ఈలు రమణారెడ్డి, టీవీ.రమణారెడ్డి, కృష్ణమోహన్, డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్‌కుమార్, చిన్నఓబులేసు, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, ఆత్మకూరు ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలిసి రండి: మంత్రి ఆనం పిలుపు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల సమస్యల పట్ల జడ్పీటీసీ, ఎమ్పీటీసీ సభ్యులు చొరవ తీసుకోకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. మండల స్థాయి సమావేశాలలో స్థానిక సమస్యలపై చర్చలు జరగాలని అక్కడ నుంచి జడ్పీ సమావేశానికి ఆ అంశాలను తీసుకొని రావాలని సూచించారు. గడిచిన రెండేళ్లుగా మంచి పరిపాలనే ఇచ్చాము కదా అంటే ముందు వరుసలో కూర్చున్న ఎమ్మెల్యేలంతా మారే వారు కాదన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి కాంట్రాక్టరు, ఎంపీ ఒక్కరే అని ఆయన పనులు ఆపేసి వెళ్లిపోయారన్నారు. ఇవాళ ఆ బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడిందన్నారు. గతంలో ఇరిగేషన్ మినిస్టర్ రివర్స్ టెండర్ తెచ్చింది తానేనంటూ అసెంబ్లీలో జెబ్బలు చరుచుకొని మాట్లాడారని, రివర్స్‌టెండర్ వల్ల ప్రభుత్వానికి 28 శాతం నిధులు మిగిలాయన్నారని అయితే పని జరిగిందా అంటే గతం కంటే ప్రస్తుతం రెండింతలు ఎస్టిమేషన్ పెరిగిందని చెప్పారు. 'తెలుగు గంగ కాలువ రాకపోవడంతో మీ ప్రాంతంలో రైతులు ఎంత నష్ట పోయారో డక్కిలి, వెంకటగిరి, బాలయ్యపల్లి జడ్పీటీసీ, ఎమ్పీటీసీలు ఆలోచించాలి. ఐదేళ్లలో ఎందుకు ఆ పనులు చేయలేక పోయామో సమాధానం చెప్పాలి. గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి అందరూ పని చేయం డి. మిగిలిపోయిన పనులను కనీసం రానున్న రెండేళ్లలో పూర్తి చేసేలా కష్టపడాలి. వచ్చేది వర్షాకాలం రైతాంగ సమస్యలు పరిష్కరించ డంలో అంతా కలిసి ముందుకు రావాలి. మూడేళ్ల క్రితం సోమశిల ప్రాజెక్ట్ గేట్లు, పక్కనే ఉన్న సోమేశ్వర స్వామి ఆలయం విగ్రహం కిలోమీటరు కొట్టుకు పోతే పట్టించుకో లేదు. సోమశిల బాగు చేయాలని పదే పదే కోరితే నన్ను అనర్హుడును చేశారే తప్ప గత ప్రభుత్వం సోమశిలను బాగుపరచడంలో ఒక్క ఆలోచన కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండవ వారమే ఇరిగేషన్ శాఖ మంత్రిని జిల్లాకు తీసుకువచ్చి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి సోమశిలకు వెళ్లి ప్రాజెక్టు మరమతులు చేయాలని కోరాము. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించుకొని రూ.9 కోట్ల నిధులు ముఖ్యమంత్రి ఆదేశాలతో మంజూరు చేసేందుకు రికార్డులు సిద్ధం చేశాం. ఇవాళ వైసీపీ వైఫల్యాలను ఎత్తి చూపాలంటే సాయంత్రం 6 గంటల వరకు చెబుతానే ఉంటా"నన్నారు.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/ స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 10 : శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిండుగా కనిపించింది. హుందాగా సాగింది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణలతో సహా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. నీటిపారుదల శాఖపైనే ప్రధాన చర్చ జరగ్గా, ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలని సమావేశం తీర్మానిం చింది. పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన విద్యాకమిటీల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైసీపీ జడ్పీటీసీ, ఎంపీపీలు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిలు డీఈఓపై విరుచుకుపడ్డారు. వివిధ అంశాలపై మంత్రు లు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. అధిక శాతం మంది సభ్యులు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, సబ్సిడీపై వ్యవ సాయ పనిముట్లను సామూహికంగా కాకుండా వ్యక్తిగతంగా ఇవ్వాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైసీపీ వర్సస్ డీఈవో

కాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు సోమశిల ప్రాజెక్టుపై అధికారుల సమావేశానికి వెళ్లడంతో జడ్పీ సమావేశ మందిరం అధికంగా వైసీపీ జడ్పీటీసీ, ఎమ్‌పీటీసీ సభ్యులు, ఎమ్మెల్సీలతో నిండిపోయింది. ఈ క్రమంలో విద్యా శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు అసలు డీఈవో ఫోన్ కూడా లిఫ్ట్ చేయరంటూ మండిపడ్డారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుల అడ్జస్ట్‌మెంట్లు, నూతన భవన నిర్మాణాలు, కేఎస్‌ఆర్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి అంశాలపై ప్రశ్నిం చారు. డీఈవో రామారావు సమాధానం ఇస్తుండగా ఒక్క ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేకు న్నారంటూ ఆగ్రహించారు. అదే సమయంలో మరో ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి స్కూల్ కమిటీ ఎన్ని కల్లో అవకతవకలు జరిగుతున్నా ఎందుకు స్పందించ లేదని డీఈవోను ప్రశ్నించారు. వెంటనే జడ్పీ చైర్‌పర్సన్‌ఆనం అరుణమ్మ సైతం తాను ఫోన్ చేసినా మీరు లిఫ్ట్ చేయడం లేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీరు (డీఈవో) విధులు సక్రమంగా నిర్వ హించడం లేదని, ప్రభుత్వం మీకు ఊరికే జీతాలు ఇస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వైసీపీ నాయకులు, డీఈవో మధ్య అర్థగంట పాటు వాడివేడి వాదనలు జరిగాయి. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అవినీతిని పట్టించుకోండి

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇరిగేషన్ కెనాల్స్ పేరుతో వైసీపీ నాయకులు కోట్ల రూపాయల అవినీతి చేశారు. ఒక్క పార మన్ను కూడా ఎత్తకుండా రూ.18 కోట్లు తినేశారు. మంత్రులు, కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకోవాలి. వైసీపీ నాయకుల అవినీతి వల్ల కాలువలు బాగు పడ లేదు. 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు చెందిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది.



హౌసింగ్, ఎన్‌ఆర్ ఈజీఎస్‌లలోనూ అవినీతి జరిగింది. బండేపూడి కెనాల్ టెండర్లు పిలిచి ఎనిమిదేళ్ల దాటుతున్నా పనులు మొదలు కాలేదు. ఇంకెప్పుడు చేస్తారు. వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలి. ఉద్యాన పంటలపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన వ్యయం కన్నా 2019-24లో చేసిన వ్యయం 40 శాతానికి మించి లేదు. ఇలా ఎందుకు జరిగిందో అధికారులు తెలపాలి.

- సోమిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ఆయకట్టు స్థిరీకరించండి

ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి ఆయకట్టు ఆధారంగా సోమశిల జలాలు కేటాయించడం వల్ల కావలి ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఇంకా నెల్లూరులోని మాగుంట లేఅవుటుతో సహా పలు ప్రాంతాలు ఆయకట్టు జాబితాలో ఉన్నట్లు నీటిని కేటాయిస్తున్నారు.



నిజంగా నెల్లూరు నగరంలో వ్యవసాయం చేస్తున్నారా? ఇవన్నీ ఏనాడో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌లుగా మారిపోయాయి. కానీ అధికారులు మాత్రం అక్కడ ఆయకట్టు ఉన్నట్లు నీటిని కేటాయిస్తున్నారు. మరోవైపు కావలి డివిజన్‌లో ఆయకట్టుకు నీరు అందక పొలాలు బీడుబారుతున్నాయి. వ్యవసాయం జరిగే చోట నీళ్లు ఇవ్వకుండా నగరంగా మారిన ప్రదేశాల పేరుతో నీటిని వృథా చేయడం తగదు.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే



ఏ సమస్య ఉన్నా తెలపండి!

జిల్లాకు సంబంధించి కేంద్రంలో ఏ సమస్య పెండింగ్‌లో ఉన్నా, ప్రజలకు సంబంధించిన ఏ పని అవసరం ఉన్నా తన దృష్టికి తెస్తే దాని సాధనకు కృషి చేస్తానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ప్రజలకు సేవ చేయడానికే ఎంపీగా వచ్చానని, తనను ఉపయోగించుకోవాలని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యేలను కోరారు. జిల్లా అభివృద్ధి కోసం తాను చేసే ప్రయత్నంలో ప్రజాప్రతినిధులంతా సహకరించాలని కోరారు.

- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు ఎంపీ



'అల్తూరుపాడు' పనులు చేస్తారా!? లేదా!?

అల్తూరుపాడు రిజర్వాయర్ కోసం రైతుల నుంచి 250 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా ప్రాజెక్టు కట్టలే. రైతులకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదు. ఇటు నగదు అందక, అటు సేద్యం చేయలేక ఆ రైతులను బతకమంటరా!? చావమంటారా!? ఆ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులను నిలుపుదల చేయాలి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే



'రాళ్లపాడు'కు మోక్షం ఎప్పుడు?

రాళ్లపాడు ప్రాజెక్టు ఇప్పటికి రెండు సార్లు తెగిపోయింది. ఈసారి కూడా గేట్లు ఎత్తాలంటే భయపడే పరిస్థితి ఉంది. వెంటనే ఈ గేట్లకు స్టాప్‌లాక్ అయినా బిగించాలి. మోపాడు చెరువు నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

దంపతుల మధ్య మద్యం చిచ్చు

ఎంతో సంతోషంగా ఉన్న ఆ కుటుంబంలో మద్యం చిచ్చు రేపింది. మద్యానికి బానిస అయిన భర్తను అప్పులు చేయవద్దని, మద్యం తాగొద్దని భార్య బతిమలాడినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో విసిగిపోయిన ఆ ఇల్లాలు బలవన్మరణానికి పాల్పడింది. ఇది తెలుసుకున్న భర్త భార్య మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తూ వేగంగా వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దంపతుల మరణంతో వారి ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. శనివారం నెల్లూరులో జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది.

- తాగుడుకు బానిసైన భర్త.. మానుకోవాలని భార్య వేడుకోలు
- చివరకు ఉరి వేసుకుని ఇల్లాలు ఆత్మహత్య
- ఇది తట్టుకోలేక రైలు కింద పడి భర్త బలవన్మరణం
- నెల్లూరు నగరంలో విషాదం

నెల్లూరు (క్రైం), ఆగస్టు 10 : ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కె నాగరాజు (23), సురేఖ (19) నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. నాగరాజు మార్బుల్, టైల్స్ పనులు చేస్తుండగా, సురేఖ ఓ బ్యూటీపార్లర్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. వీరికి మూడేళ్ల, 11 నెలల ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతోషంగా సాగుతున్న వారి కుటుంబంలో మద్యం మహమ్మారి ప్రవేశించింది. మద్యానికి బానిసైన నాగరాజు సంపాదనంతా మద్యం సేవించడానికే ఖర్చు చేసేవాడు. అక్కడితో ఆగక పలుచోట్ల మద్యం కోసం అప్పులు చేసేవాడు. దీంతో కుటుంబ భారం సురేఖపై పడింది. అప్పులు చేయవద్దని, మద్యం మానేయాలని పలుమార్లు భర్తకు నచ్చజెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. అంతేగాక పుట్టినింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భార్యపై నాగరాజు ఒత్తిడి చేసేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం పని నిమిత్తం నాగరాజు బయటకు వెళ్లగా సురేఖ ఇంట్లో ఉరి వేసుకుంది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు దీప్తి, సురేష్‌లు హుటాహుటిన ఇంటివద్దకు చేరుకుని ఆమెను కిందకు దించి రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. అప్పటికే సురేఖ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. భార్య ఆత్మహత్య చేసుకుందన్న విషయం తెలుసుకున్న నాగరాజు హాస్పిటల్ వద్దకు వెళ్లి కన్నీరుమున్నీరయ్యాడు. అక్కడ నుంచి పరుగులు తీసుకుంటూ విజయమహల్ గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సురేఖ ఆత్మహత్యపై సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఎస్ఐ విజయ్ శ్రీనివాస్, నెల్లూరు తహసీల్దార్లు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి దీప్తి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నాగరాజు ఆత్మహత్య ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.





మృతి చెందిన నాగరాజు, సురేఖ (ఫైల్)

ఎక్కడి వాళ్లు అక్కడే!

ఎంపీడీవోలను యథాస్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు

నెల్లూరు (జడ్పీ): ఎన్నికల విధుల కోసం జిల్లా నుంచి తాత్కాలిక బదిలీపై వెళ్లిన ఎమ్పీడీవోలను యథాస్థానాలకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికలకు ముందు 31 మంది ఎమ్పీడీవోలను ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావ టంతో బదిలీపై వెళ్లిన వారందరినీ జిల్లాకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిలో 25 మందికి గతంలో పనిచేసిన మండలాలనే కేటాయిస్తూ జడ్పీ సీఈవో కన్నమ్మనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెం.	ఎంపీడీవో పేరు	కేంద్రం
1.	పీవీ.నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం
2.	ఎం.బ్రహ్మయ్య	కొండాపురం
3.	బి.సింగయ్య	డీవీ సత్రం
4.	ఎం.గోపి	సంగం
5.	పి.ప్రవీణ్	ఆత్మకూరు
6.	ఎం. బాస్కర్	ఏఎస్‌పేట
7.	ఎ.మధుసూదనరావు	అనంతసాగరం
8.	కె.నాగేంద్రబాబు	ఇందుకూరుపేట
9.	కె.ప్రత్యూష	ముత్తుకూరు
10.	జి. వెంకటేశ్వర్లు	మనుబోలు
11.	వివి. సూర్యసాయి	చిల్లకూరు
12.	ఎం. భవాని	కోట
13.	కె. సాలేట్	చిట్టమూరు
14.	కె.సురేష్‌బాబు	పెళ్లకూరు
15.	పి.ప్రసన్నకుమారి	డక్కిలి
16.	ఎ.ప్రమీలా రాణి	సూళ్లూరుపేట
17.	టి. నాగేష్ కుమారి	పొదలకూరు
18.	పి.నాగమణి	మర్రిపాడు
19.	ఏవీ.సుబ్బారావు	బోగోలు
20.	ఎం.శ్రీహరి	కోవూరు
21.	పి.సుబ్రహ్మణ్యం	కొడవలూరు
22.	వి.రజినీ కాంత్	ఓజిలి
23.	కేవీ. కోటేశ్వరరావు	వెంకటగిరి
24.	కే.గోవర్ధన్	కలువాయి
25.	కె.వెంకటేశ్వరరావు	గూడూరు

మాలకొండ ఆదాయం రూ. 12,44,608

వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,44,608 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,66,500, అన్నదానం ద్వారా రూ.3,59,463, లడ్డూ ప్రసాదం రూ.2,08,555, తలనీలాలు రూ.69,950, రూము అద్దెలు రూ.36,410, విరాళాలు ద్వారా రూ.33,100 కుంకుమార్చన రూ.28,480, అష్టోత్తరం టిక్కెట్లు రూ.12,850, వివాహాలు రూ.13 వేలు తదితరాల ద్వారా ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.

WALK - IN -INTERVIEW
ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకుల కోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలకు హాజరుకాగలరు.
ఆంధ్రజ్యోతి
డివిజన్ సేల్స్ రెప్రెజెంటేటివ్స్ (SR's)
వెంకటగిరి, ఉదయగిరి, కలిగిరి, ఆత్మకూరు, నెల్లూరు టౌన్
అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చే విధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హత ఇంటర్ మరియు సేల్స్ రంగం పై ఆసక్తి కలిగి ఉండవలెను.
అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును.
పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.
ఇంటర్వ్యూ తేది: 13-08-2024
ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు
ఇంటర్వ్యూ స్థలము: ఆంధ్రజ్యోతి బిల్డింగ్
నెం.91, ఉడ్ కాంప్లెక్స్, అయ్యప్పగుడి సెంటర్, వేదాయపాళెం, నెల్లూరు - 524004. సెల్: 99854 11424

పంచాయతీ నిధులు
దుర్వినియోగం

- మంచినీటి పథకం మిషన్లు మరమ్మతు చేసినట్లు రూ.1.62లక్షలు స్వాహా
- పనులు చేపట్టకుండానే నిధుల డ్రా
- యర్రంరెడ్డిపల్లిలో వెలుగు చూసిన వైనం



మూతపడిన యర్రంరెడ్డిపల్లి తాగునీటి పథకం

వరికుంటపాడు, ఆగస్టు 10: గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారిన అధికారులు పనులు చేపట్టకుండానే పంచాయతీ నిధులను డ్రా చేయించి దుర్వినియోగానికి పాల్పడిన సంఘటన ప్రస్తుత శాసనసభ్యులు కాకర్ల సురేష్ స్వగ్రామమైన యర్రంరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఆ గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకమై రూ.లక్షలో నిధులను దోచేసిన వైనం సమాచారహక్కు చట్టంతో వెలుగులోకి వచ్చింది. వివరా ల్లోకి వెళితే.. ప్రజల దాహార్తి తీర్చేందుకు తెలుగుదేశం హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద 2018లో రూ.5లక్షల వ్యయం తో తాగునీటి పథకాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రజలు ఆ నీటిని సద్వినియోగం చేసుకొని దాహార్తి తీర్చుకొనేవారు. సుమారు ఏడాది క్రితం ఆ పథకంలోని కొన్ని మిషన్ పాడైపోయా యి. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో విలు వైన సామగ్రి తుప్పుపడుతున్నాయి. చేసేదేమిలేక అక్కడి ప్రజలు బిందెడు నీటి కోసం ఇతర గ్రామాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే అవకాశంగా భావించిన అధికా రులు మామూళ్లకు ఆశపడి పనులు చేయకుండానే ఆ తాగునీటి పథకంలోని మిషన్లకు మరమ్మతులు చేయించామని గతేడాది నవంబరులో తప్పుడు రికార్డులు సృష్టించారు. ఎంచక్కా రూ.1.62లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులను డ్రా చేసి జేబులు నింపుకున్నారు. అంత మొత్తంలో నిధులు డ్రా చేసినా కనీసం మరమ్మతు పనులు చేపట్టలేదు.

అరుగు నిర్మాణంలోనూ: అంతేగాకుండా అడిగేవారు లేరులే అన్న ధీమాతో అరుగు నిర్మాణంలోనూ అధికారులు చేతివాటం ప్రదర్శించారు. కేవలం రాజకీయం లబ్ధి కోసం ఓ కుల ప్రాతిపదికన 2022లో అరుగు నిర్మించి రూ2.30 లక్షల వెచ్చించినట్లు రికార్డులో నమోదు చేశారు. అయితే అక్కడ ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించింది ఇనామినేషన్ నిధులతో. కేవలం శాశ్వత పనులు మాత్రమే చేపట్టాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు గ్రామానికి శివారున ప్రజలు కాసేపు సేద తీరేందుకు కూడా ఉపయోగం లేని ప్రాంతంలో అరుగు నిర్మించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తతంగమంతా మండలస్థాయి అధికారులకు విన్నవించుకున్నా కిందిస్థాయి ఉద్యోగులకే ఒత్తాసు పలుకుతుండడం ఎంత వరకు సమంజసమని ప్రజలు మండిపడుతున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసామని మరి కొంతమంది గ్రామస్థులు చెబుతున్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

● ప్రతి పోలీస్ హెల్మెట్ ధరించాలి ● సిబ్బందికి ఎస్పీ కృష్ణకాంత్ సూచన


మనుబోలు పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

మనుబోలు, ఆగస్టు 10: పెండింగ్ కేసులపై దృష్టిపెట్టి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూ చించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ను ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో కలియతిరిగి అక్కడ ఉన్న గదులు, ఆవరణ వెనుక ఉన్న క్వార్టర్స్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి పోలీసు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. స్టేషన్‌లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఏఏ విధులు నిర్వహిస్తున్నారని ఎస్ఐను అడిగి తెలుసుకున్నారు. అనం తరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌క్వార్టర్స్ పరిశీలించాం... దెబ్బతిన్న వాటిగురించి ఆలోచి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ రాంబాబు, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● **ముత్తుకూరు/వెంకటాచలం/నెల్లూరు (క్రైం) :** ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కృష్ణకాంత్ తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పరిస్థితులను ఎస్ఐ నాంచారయ్య ఎస్పీకి వివరించారు. అనంతరం ఆయన ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయాన్ని, స్థానిక పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీతోపాటు కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వెంకటాచలం స్టేషన్‌ను కూడా ఎస్పీ పరిశీలించారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐలు వీరా ప్రతాప్, రాజేష్ తదితరులున్నారు. నగరంలోని దర్గామిట్ట, వేదాయపాలెం పోలీసుస్టేషన్లను కూడా ఎస్పీ పరిశీలించారు.

పాముకాటుతో గిరిజన బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జలదంకి, ఆగస్టు10: తిమ్మసముద్రం ఎస్టీ కాలనీకి చెందిన తలపల దుర్గాప్రసాద్(13) శనివారం పాముకాటుకు గురై మృతి చెందాడు. ఉదయం బాలుడు బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కరవడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కావలి పట్టణానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వతరగతి చదువుతున్నాడు ఈ గిరిజన బాలుడు. కుటుంబసభ్యులు కుమారుడి మృతదేహం వద్ద బోరున విలపించారు. విషయం తెలుసుకుని టీడీపీ నాయకులు తల్లపనేని మధుసూదనరావు, కంచర్ల వినోద్‌నాయుడులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు..

- యాచకులుగా అనుమానిస్తున్న పోలీసులు
- కావలి మండలం చెంచుగానిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో ప్రమాదాలు

కావలి రూరల్, ఆగస్టు 10: మండలంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చెంచుగానిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో సుమారు 40 నుండి 45ఏళ్ల వయ సున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొన్నది. మృతదేహాన్ని గుర్తించిన వాహనదారులు ఈ విష యాన్ని స్థానిక వీఆర్వో శింగరయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెన్నాయపాలెం క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై మరో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉన్న వ్యక్తి వయసు సుమారు 50 నుండి 55ఏళ్లు ఉండొచ్చు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రుద్రకోట వీఆర్ఏ పరుసు నాగభూషణంకు తెలపటంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాలను పరిశీలించారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో చిరిగిన బట్టలు, వేషధారణ చూసి యాచకులుగా అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	101
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6644
వెండి కిలో ధర	రూ. 82,300
వెండి ఒక గ్రాము	రూ. 84.30

117 జీవో విద్యాభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిది

● తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 10 : గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 117 జీవో విద్యాభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నెం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎంతో ఒత్తిడికి గురవుతున్నారని, కొంతమంది ఉపాధ్యాయులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు శరాఘాతంగా మారిన జీవో నెంబర్ 84ను వెంటనే రద్దు చేయాలని కోరారు. గత ఐరిస్ హాజరును రద్దుచేసి పాఠశాలల పర్యవేక్షణకు అధికారులను నయమించాలని కోరారు. పాఠశాల పరిధిలో జరిగే నిర్మాణాల పర్యవేక్షణ నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించాలన్నారు. జీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, రవీంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి

● గిరిజన బాలికల గురుకులంలో కలెక్టర్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 10 : విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. నెల్లూరు దర్గామిట్టలోని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు రోజూ వారి సిల బస్‌తో పాటు కనీస విషయ పరిజ్ఞానం ఉండేలా స్టడీ అవర్స్ నిర్వహించా లని, టైం టేబుల్ ప్రకారం తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచిం చారు. వసతి గృహానికి అవసరమైన చిన్న చిన్న మరమ్మతులను స్కూల్ మెయింటె నెన్స్ ఫండ్ ద్వారా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం, మెనూ, వసతి సౌకర్యాలను హెచ్‌ఎం విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరుతోపాటు పలు రిజిస్టర్‌లు, స్టోర్‌రూం, విద్యార్థుల నివాస గదులు, తరగతి గదులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో పరిమళ పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు మార్గదర్శకాలలో మార్పులు చేయాలి

● ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచారి


విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 : ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగించేలా విడుదలైన సర్దుబాటు మార్గదర్శకాలలో మార్పులు చేపట్టాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు కేకే.రాజగోపాలాచారి కోరారు. ఈ మేరకు శనివారం నగరంలోని డీఈవో కార్యాలయంలో ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. టీచర్ల సర్దుబాటు మార్గదర్శకాలను ఉపాధ్యాయ సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం 117ను ప్రకారం టీచర్ల సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను ఉపసంహరించి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. తొలుత పదోన్నతులు చేపట్టిన తరువాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను విడివిడిగా పరిగణిస్తూ ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 40 దాటితే ముగ్గురు, 60 దాటితే నలుగురు, 80 దాటితే ఐదుగురు చొప్పున ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5వ తరగతి వరకు ఎస్‌జీటీలను, 6 నుంచి 8వ తరగతి వరకు ముగ్గురు సబ్జెక్ట్ టీచర్లను నియమించాలన్నారు. ఇంకా అనేక సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ప్రధాన కార్యదర్శి పీ.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎల్.వాసు పాల్గొన్నారు.

విద్యారంగం ఉన్నతికి పాటుపడాలి

● మాజీ ఎమ్మెల్సీ విఠపు


యూటీఎఫ్ వ్యవస్థాపకులకు నివాళులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 : పూర్తిగా గాడితప్పుతోన్న విద్యారంగాన్ని పరిరక్షించడంతో పాటు దాని ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని అన్నమయ్యసర్కిల్‌లో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన స్వర్ణోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో రోజుకో సంస్కరణలు తీసుకువస్తూ గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే విధంగా ఉన్న నిర్ణయాలను మార్చుకుని విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యారంగం పురోగతి సాధిస్తేనే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై, విద్యారంగంలో నెలకొన్న ఇబ్బందులపై యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేసి పరిష్కారాలు చూపిందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని గాంధీబొమ్మ నుంచి యూటీఎఫ్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, కోశాధికారి ఏ.మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎంసీ.అచ్చయ్య, రాష్ట్ర, జిల్లా నేతలు కే.పరంధామయ్య, సీహెచ్.శ్రీహరి, ఎన్‌వీ.సుబ్బారావు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేయొద్దు : బీజేపీ

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 10: రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే జన్మభూమి కమిటీలు ఏర్పాటు చయవద్దని ముఖ్యమంత్రికి విన్నవించుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ రోజు రోజుకు బురదలో కూరుకుపోతుందని, ఇక భవిష్యత్తులో ఆ పార్టీ మనుగడ సాగించేలా లేదన్నారు. మాజీ మంత్రి రోజా త్వరలో పార్టీ మారబోతుందని జోష్యం చెప్పారు. నగరంలోని కొత్తూరు రామ కోటయ్య నగర్, సుజాతమ్మ పౌల్ట్రీ కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్న అక్రమ మసీదు కట్టడాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం కేటాయించిన సుమారు రూ.10 కోట్లు విలువ చేసే 120 అంకణాల భూమిని ఆక్రమించి మసీదు నిర్మించడం ఎంత వరకు సమంజసమని ప్ర శ్నించారు. సొంత భూమి లేదా ఎవరైన దానం చేస్తే మసీదు కట్టుకోవచ్చని, మసీదు నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదన్నారు. దీని గురించి కలెక్టర్‌కి కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రబోలు రాజేష్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, ఓబీసీ మోర్చ జోనల్ ఇంచార్జ్ ముక్కు. రాధాకృష్ణ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గిరికుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

లక్షలు వెచ్చించారు..
లక్ష్యం మరిచారు

- ఆర్‌బికేల్లో మూలన చేరిన టీవీలు, కియోస్క్‌లు
- ప్రభుత్వం ధనం వృథా అంటున్న అధికారులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: రైతులకు గ్రామస్థాయిలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని వైసీపీ ప్రభుత్వం సీజన్‌ల వారీగా పంటల సాగులో విత్తు నుంచి పంట కోత వరకు రైతులకు అవగాహన కల్పిం చేందుకు రైతుభరోసా కేంద్రాల్లో (ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు) టీవీలు ఏర్పాటు చేశారు. అలాగే ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలకు కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జిల్లాలో సుమారు 594 ఆర్‌బీకేలకు టీవీలు, కియోస్క్‌లను అందజేసింది. ప్రస్తుతం అవి మూలకు చేరడంతో లక్ష్యం నీరుగారింది. మూలకు చేరిన టీవీలు, రైతులకు పంటల ఉత్పత్తి, దిగుబడులపై అవగాహన, పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్వహించే ముఖాముఖి కార్యక్రమాలు, సభలు సమావేశాలు వంటివి లైవ్ కార్యక్రమాలు ప్రదర్శించి రైతులను చైతన్యపర్చేందుకు ఏర్పాట చేసిన టీవీలు మూలకు చేరాయి. కొన్ని కేంద్రాల్లో గోడలకే పరిమితమై నిరుపయోగంగా మారాయి. ప్రారంభంలో ప్రభుత్వం నిర్వహణఖర్చులను అందించిం అనంతరం నిలిపివేసింది. కొన్ని రోజులు వీపీఏలే తమ సొంత నిధులతో నెట్, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేసి రైతులకు సేవలం దించారు. అనంతరం వాటిని పట్టించు కోవడం వదిలేశారు.


ఉదయగిరి ఆర్‌బీకేలో మూలకు చేరిన టీవీ

కియోస్క్‌లను గాలికొదిలేశారు: సచివాలయ పరిధిలోని రైతులకు విత్త నాలు, ఎరువుల విక్రయాలకు గత ప్రభు త్వం రూ.కోట్లు వెచ్చించి రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొన్నిరోజులు పనిచేసిన కియోస్క్‌లు ప్రస్తు తం మూలకుచేరాయి. కొన్నిచోట్ల వినియోగిం చినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని పరిష్కరించలేక సిబ్బంది వాటిని గాలకొదిలేశారు. దీంతో ఎక్కడికక్కడ అవి వృథాగా పడి ఉన్నాయి. వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు సైతం చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో ప్రజాధనం ఏవిధంగా వృథా చేశారో ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన టీవీలు, కియోస్క్ యంత్రాలే నిదర్శనం.


దుత్తలూరు ఆర్‌బీకేలో వృథాగా ఉన్న కియోస్క్ యంత్రం

బటన్ నొక్కే కార్యక్రమాలకే పరిమితం: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి పథకాలు విడుదల చేసే కార్యక్రమాలనే అన్నదాతలకు చూపించి అసలైన లక్ష్యాన్ని మరిచారు. గ్రామస్థాయిలో వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు రైతులకు తెలియచేయడం టీవీల ఏర్పాటు ప్రధాన లక్ష్యం. అయితే జగన్‌ను గ్రామ స్థాయిలో అద్భుత పరిపాలన అందించినట్లు రైతులకు చూపించారు. వైసీపీ ప్రభుత్వం నిధులను వృథా చేయడం తప్ప రైతులకు లబ్ధి చేకూర్చే పనులు ఏమీ చేయలేదని కొందరు వ్యవసాయాధికారులు అంటున్నారు. కూటమి ప్రభుత్వమైన వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న టీవీలు, కియోస్క్‌లు వినియోగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో నాలుకకు అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 10 : నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం తెగిన ఓ చిన్నారి నాలుకకు అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. దక్కిలి మండలం పలుగోడుకు చెందిన కృష్ణ, సాంభవిల కుమార్తె పల్లవి (16 నెలల) గ్రామంలో ఆడుకుంటూ బండపై పడింది. దీంతో నాలుక తెగిపోగా నెల్లూరు నగరంలోని పలు ఆసుపత్రులకు తరలించినా తాము శస్త్ర చికిత్స చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగాన్ని సంప్రదించగా అక్కడ వైద్యులు ఒక ఛాలెంజ్‌గా తీసుకుని 4 గంటలు శ్రమించి నాలుకను అతికించి శస్త్ర చికిత్స విజయవంతం చేశారు. చికిత్స అందించిన వారిలో డాక్టర్ సుకుమార్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కళ్యాణి, మత్తువైద్యులు డాక్టర్ శారద, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో గదుల కొరత

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: పట్టణంలోని అల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది 335 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్ట్, సెకెండ్ ఇయర్‌లో చేరారు. వీరికి కేవలం 4 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. మరో నాలుగు గదులు ఉన్నా శిథిలావస్థకు చేరాయి. చేసేదిలేక ప్రాక్టికల్స్ గదుల్లో తరగతులు నిర్వహిస్తూ అధ్యాపకులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని సవయాల్లో ఆరుబయట ఎండలో పరీక్షలు, తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కళాశాలకు నాడు-నేడు పథకం కింద అదనపు తరగతి గదులు మంజూరు.. భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో కొంతమేర ఇబ్బందులు తీరాయి. అయితే కళాశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, ప్రతి గ్రూపునకు తరగతి గదులు లేకపోవడంతో విచారకరం అని అధ్యాపకులు, విద్యార్థులు వాపోతున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా స్పందించి అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు చేసి కష్టాలు తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మనుబోలు, ఆగస్టు 10: ఆత్మహత్యా యత్నం చేసుకున్న దారా మోహన్ (32) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి నెల్లూరులో చనిపోయినట్లు పోలీసులు శనివారం తెలిపారు. మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన దారా మోహన్ నెల్లూరులో ఉంటున్నాడు. నాలుగునెలల క్రితం భార్యా భర్తల మధ్య వివాదం జరిగింది. దీంతో మోహన్ భార్యపై అలిగి కట్టువపల్లికి వచ్చేశాడు. నాలుగునెలలు అవుతున్నా భార్య ఎంతకీ రాకపో వడంతో మనస్తాపం చెందిన మోహన్ ఈనెల 6వ తేదీన బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో గడ్డిమందు తాగి ఆత్మాహత్యాయత్నంకు పాల్పడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం మోహన్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. శవ పరీక్షల నిమిత్తం మృతదేహంను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో..

కొండాపురం: శెట్టిపాలెం పంచాయతీలోని తూర్పుజంగాలపల్లికి చెందిన తడకలూరి పాపరాజు(32) శనివారం విద్యుదాఘాతంతో మరణించాడు. తన పొలంలో మోటారు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుకు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలి నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, 6ఏళ్ల కుమార్తె ఉంది. పాపరాజు మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● పట్టుబడిన వైసీపీ నేతలు

వెంకటాచలం, ఆగస్టు 10: మండలంలోని అనికేపల్లి గ్రామంలో కొంతకాలంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో వైసీపీ నేత కిరణ్ తదితరులు ఉన్నారు. పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఓపెన్ ప్లాట్స్
నెల్లూరు టౌన్‌కి దగ్గరగా ఇరుగాలమ్మ టెంపుల్ పక్కన, రేరా అప్రూవల్ కల్గిన ఓపెన్ ప్లాట్స్ అతి తక్కువ ధరకే, స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గోల్డ్ కాయిన్ గిఫ్ట్. సం.ప్ర. సెల్: 91214 59131, 94400 46140
AJR-178426

PLOTS FOR SALE
మా నూతన వెంచర్ గుంటూరు-తాడికొండ (అమరావతి) రోడ్డులో CRDA లే అవుట్‌లో రోడ్స్, డ్రైన్స్, వాటర్ ట్యాంక్, స్ట్రీట్ లైట్స్, ప్రహరీగోడ రక్షణ కలిగి గజం:19,000/- కలవు. 90100 92727 (నో బ్రోకర్స్)
AJB -194958

ప్లాట్స్ అమ్మబడును
నెల్లూరు శెట్టిగుంట రోడ్డు నాగేంద్రనగర్ V.V.R. Aditi నూతన అపార్ట్‌మెంట్ నందు 2 BHK, 3 BHK, ప్లాట్స్ అమ్మబడును. సం.ప్ర. సెల్: 79955 33516, 81975 92309
AJR-193547

FLATS FOR SALE
3BHK (1600 Sft), 2BHK (1500 sft) Flats For Sale in Lucky Enclave at Vedayapalem, Near Kamakshamma Temple, Nellore. Contact: 98664 99009, 94408 23664
AJR-7242

మధువర్షిణి మ్యారేజెస్
మధువర్షిణి మ్యారేజెస్, గత 21 సం॥లుగా అన్ని కులముల వారికి 1వ / 2వ పెండ్లి సంబంధములు కుదుర్చుచున్న అగ్రగామి సంస్థ. సంప్ర॥ తోట రవినాయుడు(టీచర్), అన్నవరప్పాడు, 4వ లైను, ఒంగోలు, సెల్ : 93921 92193.
AJO-200051

WANTED
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరుజిల్లాలో పనిచేయుటకు MBA/ డిగ్రీ అర్హత కల్గిన 29 సం॥లోపు గల యువకులు కావలెను. జీతం:17,000 + ఇన్సెంటీవ్ + టూవీలర్ మస్ట్ datta.praveen@shriramfinance.me, సం.ప్ర. సెల్: 96769 09605
AJR-178098

A to Z అమ్మబడును
A to Z సెకండ్ హ్యాండ్ వస్తువులు మరియు గృహోపకరణాలు కొనబడును మరియు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: 80191 93030, 96183 10239, 82977 83977.
AJR-193548

రామేశ్వరం, అరుణాచల యాత్ర
తేది: 17-08-24 3 రో టికెట్ 4999/- రామేశ్వరం, అరుణాచలం, ధనుష్కోటి, తిరునల్లారు, చిదంబరం (AC బస్సు, రూం+భోజనం). కె.వాసు, నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504
AJR-178340

WANTED
శ్రీ బాలాజీ అసోసియేట్స్ నందు బ్యాంక్ లోన్స్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. జీతం:10,000 మరియు Incentives. సం.ప్ర. సెల్: 8374910888
AJR-193550

కావలెను
మెడికల్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు అనుభవం కల్గిన లేడీ టెలికాలర్స్ కావలెను. Qly: ఇంటర్/డిగ్రీ, జీతం: 10to15 వేలు. సం.ప్ర. సెల్: 93473 95136, 98484 29718
AJR-178427

తీర్థయాత్రలు
తే.19-08-24ది. నెల్లూరు నుండి ప్రైవేట్ బస్ ప్రయాణం, 8 రో॥ హంపి, గోకర్ణం, మురుడేశ్వరు, మూకాంబిక, ఉడిపి, శృంగేరి, హరనాడు, ధర్మస్థల, కుక్కెసు సుబ్రమణ్యం, బేలూరు, మేలుకోట, మైసూరు, ఊటీ, ఉ॥ కాఫీ, టిఫిన్, భోజన వసతులతో. సం.ప్ర. సెల్: 99895 94997, 94942 85654
AJR-193549

ASTROLOGY
కేరళ మహాంకాళి మాంత్రిక జ్యోతిష్యం. మీ ఎటువంటి గుప్త కఠిన సమస్యలకు 2రోజులలో శాశ్వత పరిష్కారం. స్త్రీ పురుష వశీకరణ 100% గ్యారంటీ P//.V.D. Bhatt: 6304163239
AJD:199501

మా చిత్రంలో నటించే అవకాశం
[illegible] సెల్.7981403355కు [illegible] Hyd. [illegible]
AJH-002567

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

నెట్టర నెట్టు .. హైలెస్సా..!

- ఉదయగిరి డిపోలో మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు
- సెల్ఫ్, డీజిల్ లేక, టైరు పంక్చర్లతో ఆగిపోతున్న ప్రగతి చక్రాలు
- సమయానికి గమ్యానికి చేరుకోని ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ ఉన్నతాధికారులు



సెల్ఫ్ లేకపోవడంతో బస్సును నెట్టుతున్న ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు (ఫైల్)



మార్గమధ్యంలో టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్, కండక్టర్ అవస్థలు (ఫైల్)

ఉదయగిరి రూరల్ : ఆర్టీసీ బస్సు చార్జీలను మూడుసార్లు పెంచిన గత వైసీ పీ ప్రభుత్వం బస్సుల నిర్వహణ ను మాత్రం గాలికొదిలేసింది. డొ క్కు బస్సులను సైతం రోడ్డెక్కించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. నాటి నిర్లక్ష్యం నేటికీ వెంటాడుతోంది. బస్సుల నిర్వహణ సరిగా లేకపోవడంతో తరుచూ స మస్యలతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కొన్ని బస్సులకు సెల్ఫ్ లేక ప్రయాణికులు, సిబ్బంది తొయ్యాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని బస్సుల టైర్లు తరుచూ పంక్చర్లు అవుతుండడంతో డ్రైవర్ల అప్రమత్తతో ప్రమాదం నుంచి ప్రయాణికులు బయటపడుతున్నారు. బస్సులకు అద్దాలు, డోర్లు లేకపోవడం, వర్షాల కురుస్తున్న సమయంలో ఉరుస్తుండడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల హైదరాబాదు వెళ్లిన సూపర్‌లగ్జరీ బస్సు తిరుగు ప్రయాణంలో డీజిల్ అయిపోవడంతో ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించిన సంఘటనలూ ఉన్నాయి. డిపో నుంచి ఇతర రాష్ట్రాలకు నిత్యం వందలాది ప్ర యాణికులు రాకపోకలు సాగిస్తునా సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి.

● డొక్కు బస్సులతో అవస్థలు..

ఉదయగిరి డిపోలో 61 ఆర్టీసీ, 6 అద్దె బస్సులు ఉన్నాయి. ప్రతిరోజు అవి 27,105 కిలోమీటర్ల తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఉదయగిరి-సీతారామ పురం, ఉదయగిరి- బద్వేల్, ఉదయ గిరి- కావలి మార్గాల్లో తిరుగు బస్సులు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కొన్ని బస్సులకు సీట్లు ఊడడం, డోర్లు, కిటికీలకు అద్దాలు లేకపోవడంతో పాటు వర్షం కురిస్తే బస్సులు పూర్తిగా ఉరుస్తున్నాయి. కొన్ని బస్సులు తప్పుపట్టి ఉన్నాయి. కాలం చెల్లిన బస్సులను సైతం తిప్పుతున్నారని విమర్శలున్నాయి.

● అధ్వానంగా బస్ షెల్టర్

ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్ మందుబాబులు, యాచకులకు అడ్డాగా మారింది. బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపైన ఎండ, వానకూ తడుస్తూ వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి బస్సులు కండిషన్‌లో ఉంచడంతో పాటు బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకరావాలన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

అనంతసాగరం, ఆగస్టు 10: ఉద్యాన పంటల సాగుపై గౌరవరం రైతులకు శనివారం అధికారులు అవగాహన కల్పించారు. మిర్చి, బొప్పాయి, నిమ్మ సాగులో వేరుకుళ్లు, వైరస్, రసంపీల్చే పురుగుల నివారణ చర్యలు, తెగుళ్లు సోకిన సమయంలో వాడాల్సిన మందుల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త నారాయణ స్వామి, మండల వ్యవసాయాదికారి రాజశేఖర్ ఉన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: ఈ నెల 19న అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షణకు ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి 18వ తేదీన ఉదయం 8గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస రావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రానుపోను ఒక్క వ్యక్తికి రూ.1650లు చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ సర్వీసు ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ చూపించుకొని అనంతరం అరుణాచలంకు వెళుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాల కోరారు.

వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి

● ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి

ఆత్మకూరు, ఆగస్టు 10: ప్రభుత్వ కాలేజీ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించేందకు ప్రత్యేక దృష్టి సారించామని ఏబీసీడబ్ల్యూవో ఎం.శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల కాలేజీ హాస్టల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వసతిగృహాల్లోని విద్యార్థినుల సంరక్షణ బాధ్యతలను హాస్టల్ సంక్షేమ అధికారులు, సిబ్బందితో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు వారి తల్లిదండ్రులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో సునీత, లెక్చరర్ శిరీష పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకల నిధులు పెంపుపై హర్షం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: రాష్ట్రప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిధులు పెంచడంపై టీడీపీ రాష్ట్ర కార్య దర్శి మన్నేటి వెంకటరెడ్డి శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 34ఏళ్ల తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌క ల్యాణ్ వేడుకల కోసం పంచాయతీలకు నిధులు పెంచడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మైనర్ పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు.

వసతిగృహాలను మూసివేయడం దారుణం

విద్యార్థులు లేరన్న నెపంతో పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతిగృహాలను మూసివేయడం దారుణమని మన్నేటి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిలక వసతిగృహాన్ని మూసివేసేందుకు అధికారులు చర్యలు చూస్తున్నట్లు వాపోయారు. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు వ్యవసాయ కాలేజిలకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజు విద్యార్థులు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారిని దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి వసతిగృహాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు

శిథిలావస్థలో పాఠశాలల భవనాలు



కొరిమెర్ల పాఠశాల స్లాబు దుస్థితి

సంగం, ఆగస్టు 10: కొరిమెర్ల ప్రభుత్వఉన్నత పాఠశాల శిథిలమై స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. 1960లో సుమారు 12గదులను నిర్మించారు. వర్షం వస్తే గదులు ఉరుస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందో.. ఏ ప్రమాదం ముంచుకుస్తుందో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనంతసాగరం: బొమ్మవరం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. బిల్డింగ్ పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలడంతో నిత్యం భయం గుప్పిట్లో తరగతులను కొనసాగిస్తున్నారు. నాడు-నేడు కింద రెండోవిడతలో నిధులు మంజూరు కాలేదని ఉపాధ్యాయులు వాపోయారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆత్మకూరు: ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో యూటీఎఫ్ నేతలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు కంబాల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలలకు ప్రమాదకరంగా మారిన 117జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆరికంగా నష్టపోయిన ఉద్యోగులకు నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దస్తగిరిఅహ్మద్, ఫణిరాజ్, మున్నా, కరీం, ఖాదర్‌బాషా, సుబ్బారెడ్డి, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో సంఘం నాయకులు ఉద్యమ పతాకాన్ని ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు శ్రీరాములు, లక్కు కృష్ణప్రసా ద్, జిల్లా కార్యదర్శి గంగాధర్, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ నాయకులు ప తాకావిష్కరణ చేసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. జీఓ నెం.117రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, పేరాల శ్రీనివాసులు, మ హేష్, వెంకటేశ్వర్లు, ప్రసాదు, పవిత్ర కుమారి,విజయ్ కుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

● ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ

వింజమూరు, ఆగస్టు 10: ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి నియోజకవర్గం నుంచి మాదిగలు తరలిరావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ పిలుపునిచ్చారు. వింజమూరులో శనివారం ఎంఎస్పీ సీనియర్ నాయకులు బెజవాడ బాలగురవయ్య మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నియోజకవర్గస్థాయి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ అంశంపై సానుకూల తీర్పు రావడంతో మాదిగల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. గత 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఈ తీర్పు అని కొనియాడారు. విజయం సాధించి ఢిల్లీ గడ్డ నుంచి తెలుగు నేలపై అడుగు పెడుతున్న మంద కృష్ణమాదిగ విజయోత్సవ ర్యాలీకి రాష్ట్ర జిల్లా నలుమూలల నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, సీనియర్ యద్దనపూడి రమణయ్య, నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు మాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రిమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నందిపోగు వెంగళరావు, ఎంఎస్పీ మండల అధ్యక్షులు బొర్రా వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రహదారులకు మోక్షం

● నందవరం- పోలిరెడ్డిపల్లి వరకు పనులు ప్రారంభం

● హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు



రోడ్డుపై జరుగుతున్న కంకర పనులు

మర్రిపాడు, ఆగస్టు 10: మండలంలోని గ్రామాల రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి గ్రామాల్లోని రోడ్ల నిర్మాణాలకు రూ.5కోట్లను మంజూరు చేయించారు. అధికారులు వాటి నిర్మాణాలు టెండర్లు పిలిచారు. అందులో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రా రంభించారు. అందులో భాగంగా నందవరం నుండి పోలిరెడ్డిపల్లి వరకు 16కిలో మీటర్ల రోడ్డు పనులు ప్రారంభించటంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటితోపాటు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతుల కోసం మరో రూ1.51 కోట్లు మంజూరయ్యాయి. రాజులపా డు-పెగళ్లపాడు రోడ్డుకు రూ.29లక్షలు, నెర్దనంపాడు-భీమవరం, పొంగూరు, కంద్రిక రహదారులకు రూ.23లక్షలు, కంపస ముద్రం-వెంకటాపురం రోడ్డుకు రూ.20లక్షలు, చాబోలు-వెంకటాపురం రోడ్డుకు రూ.18లక్షలు, సిగణపల్లి-నాగినేనిగుంట రోడ్డుకు రూ.16లక్షలు, చాబోలు-బ్రాంహ్మణ ఎల్లి రోడ్డుకు రూ.8లక్షలు, బ్రాహ్మణపల్లి ఎస్సీకాలనీ రోడ్డుకు రూ.7లక్షలు, కంపసముద్రం-బెడుసుపల్లి రోడ్డుకు రూ.6లక్షలు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు మరమ్మతులకు ఈ నెల 10న అధికారులు టెండర్లు పిలువను న్నారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేసు న్నారు.



బురదమయంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణం

వానొస్తే ఇదీ పరిస్థితి..!

ఉదయగిరి రూరల్, ఆగస్టు 10: పట్టణంలో చిన్నపాటి వర్షానికే వీధులు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలు వర్షపు నీటితో నిల్వ చేరి బురదమయంగా మారుతున్నాయి. రెండురోజుల కిందట కురిసిన ఓ మోస్తారు వర్షానికి తహసీల్దారు కార్యాలయ ఆవరణం బురదమయంగా మారింది. అధికారులు, సిబ్బంది, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాలాజీనగర్, పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గంలోని ప్రధానరోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటుంది.



బాలాజీనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అధ్వానంగా రహదారులు

● ప్రజలు, వాహనదారుల అవస్థలు



అన్నెబోయినపల్లి వద్ద గుంతలు పడిన పంచాయతీరాజ్ తారు రోడ్డు

లింగసముద్రం, ఆగస్టు 10: మండలంలోని పలు గ్రామాలలోని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లింగసముద్రం నుంచి వలేటివారిపాలెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, వీఆర్ కోట నుంచి తాతాహోటల్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, అన్నెబోయినల్లి నుంచి అంగిరేకులపాడు వరకు, విశ్వనాధపురం నుంచి వీఆర్ కోట వరకు, గంగపాలెం నుంచి తిమ్మారెడ్డిపాలెం వరకు, ముత్యాలపాడు నుంచి ముత్తంవారిపాలెం వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లుపై తారు, కంకర లేచిపోయి గుంతలుపడి అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్ల అభివృద్ధి పట్టించుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కందుకూరు: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు



కావలి: యూటీఎఫ్ జెండా ఆవిష్కరణలో నేతలు

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కందుకూరు, ఆగస్టు 10: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కందుకూ రులోని దాచూరి రామిరెడ్డి విజ్ఞాన్ భవన్‌లో యూనియన్ నాయకులు, ఉపాధ్యాయుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ సీనియర్ నేత ముప్పరాజు కోటేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబో యే రోజుల్లో యూటీఎఫ్ నేతలు, కార్యకర్తలు సమస్యలపై పోరాటం చేయా లని నిర్దేశించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి వెంకటేశ్వర్లు, ఎం మాధవరావు, ఎం హనుమంతరావు, జి మాధవరావు, ఎస్ శాంతకు మారి, తదితరులు పాల్గొన్నారు.

కావలి టౌన్: స్థానిక కోర్టువీధిలోని యూటీఎఫ్ కార్యాలయ ఆవరణలో సంఘం జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం ట్రంకురోడ్డులో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు మాధవ, శ్రీదేవి, జీ వేణు, ముజీబ్, జీ మురళీ, సీనియర్ నాయకులు ఆకుల రమణయ్య, సిద్ధిక్, ప్రసాద్ పాల్గొన్నారు.



లింగసముద్రం: యూటీఎఫ్ జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం: ఉపాధ్యాయుల హక్కుల సాధనకు యూటీఎఫ్ పోరాటం చేస్తోందని ఆ శాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం లింగసముద్రంలో కామ్రేడ్ కూరపాటి రమేష్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు టి సరోజిని, టి సుధాకర్ రావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కందుకూరు, ఆగస్టు 10: మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ శనివారం కందుకూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రమణమ్మ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధి ఎన్నో రెట్లు పెరిగినప్పటికీ నేటికీ మున్సిపాలిటీ ఆవిర్భవించినప్పుడు ఉన్న కార్మికులనే కొనసాగిస్తున్నారని, కార్మికుల సంఖ్యను పెంచకపోవటంతో పనిభారం ఎక్కువై ఆ ప్రభావం పారిశుధ్యం నిర్వహణపై పడుతున్నదని తెలిపారు. అలాగే చెత్తబండ్లు రిపేరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పులి నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, మహేష్, పోతురాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాణపురం-అన్నెబోయినపల్లి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న గుత్తేదారు టీడీపీ నేత మనోహర్

లింగసముద్రం, ఆగస్టు 10: సార్వత్రిక ఎన్నికలకు మూడు నెలల ముందు మండలంలోని సత్యనారాయణ పురం-అన్నెబోయినపల్లి గ్రామాల మధ్య నిలిపివేసిన పంచాయతీరాజ్ రోడ్డు పనులను అధికారులు, గుత్తేదారు తిరిగి శనివారం ప్రారంభించారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి అప్పటి జిల్లా కలెక్టర్ ఉపాధిహామీ పథకం కింద రూ.40 లక్షలు మంజూరు చేశారు. దీంతో అప్పటి గుత్తేదారు ఈ రోడ్డుపైన ఉన్న తారు, కంకర లేపి రోడ్డును రోలింగ్ చేసి అనంతరం పనులను నిలిపివేశారు. ఇటీవల ఈ విషయాన్ని చినపవని టీడీపీ నేత సోంపల్లి మనోహర్, గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పనులను తిరిగి ప్రారంభించాలని ఆయన పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. దీంతో మండల పీఆర్ ఏఈ గోపిచంద్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌రాజ్, టీడీపీ నేత, గుత్తేదారు మనోహర్ ఇతర టీడీపీ నేతలు పూజలు చేసి రోడ్డు పనులను ప్రారంభించారు.

16న లక్ష కుంకుమార్చన పూజలు

● పత్తి వీరబ్రహ్మయ్య స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న పత్తి వీరబ్రహ్మయ్య స్వామి

కావలి, ఆగస్టు 10: లోక కల్యాణార్థం రాజువారి చింతలపాలెం విజయదుర్గ ఆస్థాన పీఠంలో ఈ నెల 16న శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆస్థాన పీఠం వ్యవస్థాపకులు పత్తి వీరబ్రహ్మయ్యస్వామి తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో బ్రహ్మయ్య స్వామి మాట్లాడారు. వరలక్ష్మీవ్రతంలో భాగంగా ఈ పూజలను 30ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విశిష్టత కలిగిన పూజలలో పాల్గొనేందుకు కావలి, పరిసరప్రాంతాల ప్రజలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు పూజసామగ్రిని ఆలయం తరుపున ఉచితంగా అంజేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రెజరర్ చంద్రమౌళి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గడ్డం కోటారెడ్డి వర్ధంతి సభ

● కావలికి విరసం నేతలు

కావలి, ఆగస్టు 10: విప్లవ కెరటం కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి 50వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం పట్టణంలోని పాతూరు కృష్ణుడి బొమ్మసెంటర్‌లోని దొడ్లవారి స్థలంలో నిర్వహించనున్నట్లు కోటారెడ్డి స్మారక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విరసం నాయకుడు కల్యాణరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో వర్తమాన రాజకీయాల గురించి విరసం నేత నల్లూరి రుక్మిణీ, ప్రజాస్వామ్యం- రూపం, సారం అనే అంశంపై విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్, పెరుగుతున్న ఫాసిజం ప్రమాదం అనే అంశంపై వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ ప్రసంగిస్తారన్నారు. అనంతరం ప్రజా కళామండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

అల్లూరు, ఆగస్టు9: గ్రామీణాభివృద్ధిపై కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన తరగతుల్లో ఎంపీడీవో జ్యోతి తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామీణాభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాలపై కార్యదర్శులు, సర్పంచులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లింగసముద్రం, ఆగస్టు 10: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో లింగసముద్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలోని బందెలదొడ్డి పక్కన విద్యుత్‌శాఖ అధికారులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం, లోవోల్టేజి సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశంతో శనివారం కందుకూరు ఏడీఈ విజయ్‌బాబు, మండల ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

కందుకూరు, ఆగస్టు 10: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని యాచకులు, సంచార జాతులకు చెందినవారికి ఆహారం ప్యాకెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీచేశారు. మాచవరం ప్రవీణ్‌కుమార్, లావణ్య దంపతుల కుమార్తె మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, మీనిగ సురేష్‌బాబు, మాధవి పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

కందుకూరు, ఆగస్టు 10: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 13న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ నాయకులు వర్ల దేవదాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం సాగించి విజయం సాధించిన మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకటం, వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు కృతజ్ఞతలు తెలపటమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మాదిగ యువతీ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగులు భారీగా తరలిరావాలని కోరారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన

కలిగిరి, ఆగస్టు 10: స్థానిక పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం తిప్పలో ఏర్పాటు చేయనున్న అయ్యప్ప స్వామి ఆలయానికి వేదపండితులు సూర్యనారయణాచార్యులుచే ఆదివారం శంకస్థాపన పనులు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

పంద్రాగస్టు వేడుకల నిర్వహణ నిధుల పెంపుపై హర్షం

కొండాపురం, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధులు పెంచడంపై సర్పంచులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో చిన్నపంచాయతీలకు రూ.100, పెద్ద పంచాయతీలకు రూ.250 మాత్రమే నిధులు వాడుకునేందుకు వీలుండేదన్నారు. ఈ నగదు ఏమాత్రం సరిపోక పోవడంతో సర్పంచులు తమ స్వంత నిధులను ఖర్చు చేస్తుండేవారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూ.10వేలు, రూ.25 వేలకు పెంచడం అభినందనీయమని గుడవళ్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచెర్ల అన్నారు.

మినీమిల్క్ డెయిరీ ప్రారంభం

సంగం, ఆగస్టు 10: మండలంలోని సి ద్దీపురం సమీపంలో నిర్మించిన మల్లి మిల్క్ డెయిరీని శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. మి ల్క్ డెయిరీ సామర్థ్యం గురించి మంత్రి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దీనితో కొంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లి, వారి కుటుంబ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, ఆనం ప్రసాద్ రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్‌బాబు పాల్గొన్నారు.

పూడిక తీతకు నోచుకోని వరిణి చెరువు

ఆందోళనలో ఆయకట్టుదారులు



పూడిపోయిన వరిణి చెరువు

విడవలూరు, ఆగస్టు 10: రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే దానికి అద్దం పడుతోంది వరిణి చెరువు. ఈ చెరువు కింద వరిణి, దండిగుంట, వీరారెడ్డిపాళెం, రామతీర్థం, ఊటుకూరు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన సుమారు 4వేల ఎకరాలు సాగులో ఉంది. అయితే ఈ చెరువు పూడిక తీత పట్ల గత పాలకులు చిత్తశుద్ధి చూపకపోవటంతో నానాటికీ కుంచించుకుని పోతోంది. దీంతో చెరువు కింద ఉన్న అయకట్టుదారులు రబీ సీజన్‌కు సాగునీరు పుష్కలంగా అందుతుందా అని ఆందోళనకు గురవుతున్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నీరు-చెట్టు కింద చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చౌకిచర్ల, విడవలూరు చెరువులలో పూడిక తీత పనులు చేపట్టారు. అయితే వరిణి చెరువులో మాత్రం కొన్ని రాజకీయ కారణాల వలన పనులు చేపట్టలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెరువుల మరమ్మతు పనులను పూర్తిగా గాలికి వదిలేసింది. దీంతో వరిణి చెరువు పూర్తిగా సాగునీరు నిల్వ చేసుకునేందుకు వీలులేకుండా దాదాపు 60శాతం మేరకు పూడిపోయింది. గత కొద్దిరోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న తరుణంలో చెరువు పూడిక తీత పనులు చేపడితే రబీలో చివరి ఆయకట్టుదారులకు సాగునీరు పుష్కలంగా అందుతుందని, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లా అధికారులతో చర్చించి పూడిపోయిన చెరువు మరమ్మతులు చేపట్టి వర్షపు నీరు వృథాగా పోకుండా చర్యలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు వేడుకుంటున్నారు.

అంబరాన్నంటిన గంగమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గంగమ్మ తల్లి

పొదలకూరు, ఆగస్టు 10: పొదలకూరు గ్రామ శక్తిస్వరూపిణీ గంగమ్మ తల్లి కొలుపు మహోత్సవం శుక్రవారం మొదలై రెండో రోజైన శనివారం అమ్మవారి ఉత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం అమ్మవారి పూజా కార్యక్రమం పోతురాజు ముగ్గుకి దిష్టి తీర్పు, రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో తప్పెట్లు, కొమ్ముల వాళ్ల వాయిద్యాలతో బాణాసంచా వెలుగులలో యాదవరాజుల వీరతాళ్ల అడుగులతో గంగమ్మతల్లి గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా సాగింది. ఊరేగింపులు, డప్పుల మోతలు, వీరతాళ్లు, చిందులు, పూనకాలు, హారతులు, బైనీడీ వారి కథలతో ఊరికి ఉత్సవ శోభ వచ్చింది. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గంగాభవానీ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై డప్పుల మోతలు, బాణాసంచాలతో పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులందరూ టెంకాయలు కొట్టి హారతు లిచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గొల్ల మద్దిరిళ్ల నరసింహులు యాదవ్, ఏ కృష్ణయ్య, వేమయ్య, గోమసాని వేణు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీపీఎస్ ప్రసాద్‌యాదవ్, యరగర్ల జయరామయ్య, గోళ్ల పద్మనాభం, పడ్డాల రాము, వాకా.శివ పాల్గొన్నారు.

ఘనంగా అదానీ వ్యవస్థాపక దినోత్సవం



సభలో మాట్లాడుతున్న సీఈవో జీజే రావు

ముత్తుకూరు, ఆగస్టు 10 : అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పోర్టులో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజే రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజనరీ బిజినెస్ లీడర్ గౌతమ్‌భాయ్, అదానీ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతిజీ అదానీ నేతృత్వంలో కృష్ణపట్నం పోర్టులో భాగస్వామ్య కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రత, మహిళా సాధికారత, సహజ వ్యవసాయం, కమ్యూనిటీ ప్లాంటేషన్, అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ పరిసర గ్రామాల్లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అదానీ కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు, ఫౌండేషన్ హెడ్ రాజేష్, రంజన్, గణేష్‌శర్మ, జి వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్, ఫౌండేషన్ ప్రతినిధులు, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

విజయా డెయిరీ అధ్యక్షుడిగా 'పచ్చిపాల' నియామకం



శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న సోమిరెడ్డి

మనుబోలు, ఆగస్టు 10: స్థానిక విజయా డెయిరీ అధ్యక్షుడిగా పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డెయిరీ సెక్రటరీ పోలంరెడ్డి శ్రీనువాసులురెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్న దువ్వూరు వెంకటరమణారెడ్డి శనివారం రాజీనామా చేశారు. దీంతో డెయిరీలోని పదిమంది డైరెక్టర్లతో కొత్త అధ్యక్ష ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఏడుగురు డైరెక్టర్లు కలిసి డైరెక్టరుగా కొనసాగుతున్న పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డికి మద్దతు ఇవ్వడంతో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డిని నెల్లూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

● కేంద్ర మంత్రికి సర్పంచుల సంఘం నేతల వినతి



కేంద్ర సహాయ మంత్రిని కలిసిన సర్పంచుల సంఘం నాయకులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 10: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ సర్పంచుల సంఘం వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కలిసి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని జిల్లా ఆంధ్రప్రదేశ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను వ్యవసాయ రంగా నికి, పంచాయతీరాజ్‌కి అనుసంధానం చేయ వలసిందిగా కోరామని తెలిపారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వెంకటాచలం, ఆగస్టు 10: గౌడ సేవా సమితి ట్రస్ట్, గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటసుబ్బయ్య గౌడ్, అనికేపల్లి మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నగరంలోని టౌన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకొని 450 మార్కులకుపైగా సాధించిన గౌడ విద్యార్థులకు నగదు బహుమతి ఉంటుందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.5 వేలు చొప్పున నగదు, పుస్తకాలు, పెన్నులు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గౌడ విద్యార్థులు తప్పకుండా విచ్చేయాలని కోరారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కోవూరులో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోవూరు, ఆగస్టు 10 : యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఉపాధ్యాయ నాయకులు రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ ప్రధాన కార్య దర్శులు ఖాజావలి, భారతి మంద బయలు కూడలిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లోని యూటీఎఫ్ నాయకులు రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుపాలు, మాలకొండయ్య, రవిచంద్ర, రమేష్, సుబ్బారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, నాగభూషణం, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** స్థానిక పార్కు సెంటర్‌లో శనివారం యూటీఎఫ్ పతాకాన్ని రిటైర్డు ఉపాధ్యాయుడు టీవీ రమణయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ కార్యదర్శి కేవీ నాగిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం యూటీఎఫ్ పోరాడుతోందన్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దగదర్తి మండలాల యూటీఎఫ్ నాయకులు హజరత్‌బాబు, కే వేణు, వీ గోపి, అహమ్మద్ బాష, ఐ ప్రసాద్, జీ వేణు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వెంకన్నపాలెం దళిత కాలనీ

తోటపల్లిగూడూరు, ఆగస్టు 10: మండలంలోని వెంకన్నపాలెం దళితకాలనీ గత రెండు నెలల నుంచి అంధకారంలో ఉన్నట్లు గ్రామ టీడీపీ నేతలు తెలిపారు. దళిత కాలనీలో వీధిలైట్లు లేక ఇంటి నుంచి బయటికి రావాలంటే కాలనీవాసులు భయపడుతున్నారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలిపిన పట్టించుకోలేదని గ్రామ టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వెంకన్నపాలెం దళిత కాలనీకి వీధిదీపాలు వేయాలని కోరుతున్నారు.

ఎండిన కాలువలు

● తాగునీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



పెనుబల్లి వద్ద సదరన్ ఛానల్ కాలువలో మురికినీటిని తాగుతున్న గేదెలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 10: పొలాల్లో మేతకెళ్ళే మూగజీవాలు (గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు) తాగునీటి కోసం అల్లాడుతున్నాయని మండలంలోని పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా సాగునీటి పారుదల లేదు. ప్రధాన కాలువల్లో అక్కడక్కడా ఉన్న కొద్దిపాటి నీటితో గొంతు తడుపుకుంటూ వచ్చాయి. ఇటీవల ఆ కాలువల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా ఎండిపోవడంతో దాహార్తితో అలమటిస్తున్నాయని, వెంటనే మూగజీవాల కోసం సదరన్‌ఛానల్‌కు నీటిని విడుదల చేయాలని పాడిరైతులు కోరుతున్నారు. ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలకు బీడు పొలాల్లో పచ్చికమేత ఉన్నా పశువులకు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నీటిపారుదల అధికారులతో కనిగిరి రిజర్వాయర్‌లోని సదరన్ చానల్ నుంచి నీటి విడుదల చేయించి ఆ కాలువ పొడవునా మూగజీవాల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.

చీకట్లో పల్లెలు.. ప్రజల ఇక్కట్లు

వీధి దీపాల నిర్వహణను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

పొదలకూరు, ఆగస్టు 10: గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ దయనీయంగా మారింది. విద్యుత్ ఆదాతో పాటు పంచాయతీలపై నిర్వహణ భారం తగ్గించేందుకు గతంలోనే స్తంభాలకు ఎల్‌ఈడీ దీపాలు బిగించారు. వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ పూర్తిగా గాలికొదిలేసింది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికార పీఠం ఎక్కిన తర్వాత గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఇచ్చింది లేదు. రెండేళ్లుగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా సర్పంచులు, అధికారులకు కూడా తెలియకుండా దారి మళ్లించింది. దీంతో గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడా కనీస అభివృద్ధి అనేది లేకుండా పోయింది. వీటిలో అధిక భాగం విద్యుత్ చార్జీల రూపంలో తిరిగి రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. మిగిలిన వాటిలో కూడా ఎల్‌ఈడీ దీపాల నిర్వహణ పేరుతో మరికొంత తీసేసుకుంది. దీంతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలపై వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 2019లో రాష్ట్ర వ్యాప్తంగా వీధి దీపాలుగా ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ చాలా చౌకగా ఉండడం, విద్యుత్ వినియోగం కూడా పెద్దగా ఉండకపోవడంతో వీటిని వినియోగిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను ఈసీఎల్ కార్పొరేషన్, నెడ్‌క్యాప్ సంస్థలకు అప్పగించారు. 2019 తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరికి నిర్వహణ నిధులు సక్రమంగా ఇవ్వకపోవడంతో వీరు 2020లో ఇక తమ వల్ల కాదని చేతులెత్తేశారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఒక్క ఎల్‌ఈడీ బల్బుకు కూడా మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో అనేక గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ దీపాల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేయడంతో మండలంలోని 30 పంచాయతీలలో ప్రస్తుతం 40 శాతానికి పైగా వెలగడం లేదు. కనీస మరమ్మతులు కూడా చేయించే పరిస్థితి లేదు. ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వీధి దీపాలపై ఇప్పుడు దృష్టి పెట్టి పల్లెల్లో వెలుగులు పంచేందుకు కృషి చేస్తుందని నాయకులు చెబుతున్నారు.

యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం

● వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 : నేటి పోటీ ప్రపంచంలో యువత అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటితేనే దేశాభివృద్ధి జరుగుతుందని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావు తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం మత్తు పదార్థాల వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని విద్యా సంస్థల ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువత సామాజిక దృక్పథంతో మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉజ్వల భవిష్యత్‌పై మాత్రమే దృష్టి సారించి ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మత్తు పదార్థ రహిత దేశాన్ని నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి వై.వెంకటయ్య, ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు, వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఏ.ఉదయ్‌కుమార్, కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్లు జీ.కరుణకుమారి, బీ.ప్రసన్న, టీ.భారతి, అధ్యాపకులు రవీంద్ర నాథ్, రమణారెడ్డి, వెంకట్రావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

● అభినందన సభలో మంత్రి నారాయణ



మంత్రి నారాయణను సత్కరిస్తున్న పాలక మండలి సభ్యులు



నారాయణ, కోటంరెడ్డిలకు జ్ఞాపిక అందజేస్తూ..

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 10: రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం స్టోన్‌హౌస్‌పేట లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నూతన పాలక మండలి అభినందన సభ అట్టహాసంగా జరిగింది. అర్బన్ ఆర్యవైశ్య సంఘం, కన్యకా పరమేశ్వరి ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభ లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ ఛైర్మన్ టీజీ వెంకటేష్, ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవా ధ్యక్షుడు సీపీ పెనుగొండ సుబ్బా నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, ఆల్‌ఇండియా వాసవీ సత్ర సముదాయాల ఛైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం నేతలు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని పాలక మండలి సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ఎన్నో ఒత్తిళ్లు ఉండేవని, త మ ప్రభుత్వంలో స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ రాష్ట్ర కార్యదర్శులు కొండా ప్రవీణ్‌శంకర్, షేగు షణ్ముఖరావు, ఆలయ పాలక మండలి గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు, భవనాశి సురేష్‌బాబు, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, కార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు, అమరా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యన్ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. చిన్నారుల భరతనాట్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

● ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



పరమేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించు కునేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ ప్రముఖులు సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నగరంలోని టౌన్ హాలులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక జిల్లా మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా రంగం లో గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ నూతన విధానాలను అవలంబిస్తూ పాఠశాలల ఉన్నతికి పాటుపడాలన్నారు. జిల్లాలో విద్యారంగం ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని, అధికా రులు, ఉపాధ్యాయులు చేపట్టే కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ జేడీ ఎం.రామలింగం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు అధికంగా ఉండేలా కృషి చేయాలన్నారు. వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల్లో హింసా ప్రవృత్తి పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ జీవో నెం 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. అనంతరం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతున్న కంచి పరమేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నేతలు పిచ్చిబాబు, రియాజ్, జుల్ఫికర్ అలీ, కృష్ణారెడ్డి, కోటేశ్వర రావు, శివకోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 10 : ఈ నెల 11వ తేదీన ది కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయని పూర్వపు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అయితా భాస్కర్, పేరూరి ప్రదీప్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రంగానాయకుల పేట ది ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి, కోశాధికారి ఎన్నిక ఏకగ్రీవం అయిన కారణంగా కేవలం అధ్యక్ష పదవికి మాత్రమే ఎన్నికలు జరుగుతాయని, ఓటు హక్కు కలిగిన సభ్యులు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుండె వ్యాధులపై అవగాహన



డాక్టర్ సాహెబ్‌పీర్‌ను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 10 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ సాహెబ్‌పీర్ గుండెజబ్బులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జబ్బులు వచ్చిన వారు ఎలాంటి వైద్యం చేయించుకోవాలన్న అంశాలను వివరించారు. అనంతరం వాకర్స్ అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసి వారికి సూచనలు, సలహాలు ఇచ్చా రు. అనంతరం డాక్టర్‌తో పాటు వేసవి క్రీడాశిబిరాల సమయంలో క్రీడాకారులకు పౌష్టికాహారం అందించిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.సుబ్బరా జు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కె.జయదేవ్, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, నేతలు రాఘవేంద్రషెట్టి, చింతల అమరేంద్రరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ కృష్ణమూర్తి, పొన్నం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు గడ్డం కోటారెడ్డి వర్ధంతి సభ

● కావలికి విరసం నేతలు

కావలి, ఆగస్టు 10: విప్లవ కెరటం కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి 50వ వర్ధంతి సభ ఆది వారం ఉదయం పట్టణంలోని పాతూరు కృష్ణుడి బొమ్మసెంటర్‌లోని దొడ్లవారి స్థలంలో నిర్వహించనున్నట్లు కోటారెడ్డి స్మారక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విరసం నాయకుడు కల్యాణరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో వర్తమాన రాజకీయాల గురించి విరసం నేత నల్లూరి రుక్మిణీ, ప్రజాస్వామ్యం- రూపం, సారం అనే అంశంపై విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్, పెరుగుతున్న ఫాసిజం ప్రమాదం అనే అంశంపై వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ ప్రసంగిస్తారన్నారు. అనంతరం ప్రజా కళామండలి, అరుణోదయ సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

చెట్ల నరికివేతపై అభ్యంతరం

నెల్లూరురూరల్, ఆగస్టు 10 : నెల్లూరురూరల్లోని ధనలక్ష్మీపురంలో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న ఇళ్ల ముంగిట చెట్ల నరికివేతకు ఆ శాఖ సిబ్బంది శ్రీకారం చుట్టారు. దీంతో నివాసితులు అభ్యంతరం తెలపడంతో స్థానికులకు విద్యుత్ శాఖ సిబ్బందికి వాగ్వివాదం జరిగింది. నెలలో రెండవ శనివారం కావడంతో స్థానిక విద్యుత్ శాఖ అధికారులు మెయింటెనెన్స్ కింద మధ్యాహ్నం వరకు సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగింపు పనులు చేస్తుండగా స్థానికులు సిబ్బందిని ప్రశ్నించారు. దీనికి వారు దురుసుగా బదులివ్వడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. పైగా నగరంలో చెట్లు నరకాల్సిన అవసరం వస్తే కార్పొరేషన్ కార్యాలయానికి కచ్చితంగా సమాచారం ఇవ్వాలన్న కమిషనర్ ఆదేశాలను సైతం ఇక్కడి సిబ్బంది ఉల్లంఘించడంపైనా తీవ్రస్థాయిలో విమర్శలు రేకెత్తుతున్నాయి.

నేత్రదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 10: నెల్లూరు జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారంపూడి కృష్ణారెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి నేత్రాలను శనివారం మోడ్రన్ ఐ సెంటర్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేత్రదానం ఎంతో గొప్పదని, ప్రతి ఒక్కరు నేత్రదానం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయంలో నూతన పద్ధతులు



సెమినార్‌ను ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్

నెల్లూరురూరల్, ఆగస్టు 10 : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో నూతన పద్ధతులు అవసరమని డీఎఫ్‌వో చంద్రశేఖర్, వ్యవసాయ పరిశోధన అధికారి వినీత అభిప్రాయపడ్డారు. నెల్లూరురూరల్లోని కనుపర్తిపాడు వద్దనున్న ఇథాకా స్కూల్లో శనివారం అగ్రినోవ-2024-25 సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సంస్కరణలు అత్యవసరమన్నారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న పరిజ్ఞానానికి రైతు మారాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికను అందిపుచ్చుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు రావాలని, అప్పుడే రైతుకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కుమ్మమూరు రవికుమార్, జీఎం జీవన్‌లు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి



బిషప్ హౌస్‌లో సమావేశమైన దళిత క్రిష్టియన్‌లు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 10 : దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 12న శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు దళిత క్రిష్టియన్ నాయకులు తెలిపారు. శనివారం బిషప్ హౌస్‌లో నెల్లూరు ఎస్సీ బీసీ, ఎస్టీ కమిషన్ సెక్రటరీ ఫాదర్ వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 12వ తేదీన ఉదయం 9గంటలకు వీఆర్సీ హైస్కూల్ మైదానం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని, ఈ ర్యాలీలో జిల్లాలోని క్రైస్తవ సంఘాలు, క్రైస్తవులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలీషాకుమార్, డాక్టర్ దయాసాగర్, లేజర్ డీ.ఏసురత్నం, సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్‌లో నెల్లూరు ముస్లింల ప్రార్థనలు



చాదర్ తీసుకెళుతున్న ముస్లింలు

నెల్లూరురూరల్, ఆగస్టు 10 : నెల్లూరురూరల్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం నాయకులు రాజస్థాన్‌లోని అజ్మీర్ నగరంలోని హజరత్ ఖాజా గరీబ్ నవాజ్‌దర్గాలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, నెల్లూరురూరల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మూడవసారి విజయం సాధించాలని తామంతా మొక్కుకున్నామని ముస్లిం మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ రెండు కోర్కెలు తీరడంతో హజరత్ ఖాజా గరీబ్ నవాజ్‌దర్గాలో చాదర్ సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఆసీఫ్‌బాషా, షంషుద్దీన్, జిలానీ, ఖాదర్‌బాషా, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

SUNDAY FOCUS

లడ్డూ, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, దద్దోజనం, క్షీరాన్నం.. ఇలా తిరుమల శ్రీనివాసుడికి సమర్పించే నైవేద్యాలు అనగానే పవిత్ర భావంతోపాటూ నోరూరుతుంది. ఘుమఘుమలు ముక్కులను తాకుతాయి. తిరుమల ప్రసాదాల రుచి ఇంకెక్కడా ఎందుకు రాదా అనే సందేహం కలుగుతుంది. అయితే కొన్నేళ్లుగా ప్రసాదాల రూపూ రుచీ మీద పెదవిరుపులు పెరిగాయి. 'అబ్బే.. అప్పుడున్న రుచి.. ఇప్పుడెక్కడిది?' అనే నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. జగనన్న పాలనలో తిరుమల ప్రసాదాలు కూడా నాణ్యతలేకుండా పోయాయనే విమర్శలూ హోరెత్తాయి.

ఎందుకు ఇలా? ఏం జరిగింది?

ప్రసాదాలకు ముడి పదార్థాల వాడకంలో, దిట్టంలో మార్పులు జరిగాయి? నాణ్యమైన పదార్థాలు వాడడం లేదా? లడ్డూ నాణ్యతే కాదు, సైజూ తగ్గిపోయిందనీ, అన్నప్రసాదాలు తక్కువ వ్యవధిలోనే పాడైపోతున్నాయనీ భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వున్నారు.



గతంలోని అన్నప్రసాదాలు





ఆర్గానిక్ ప్రసాదాలు

తిరుమల ప్రసాదాల రుచి ఎందుకు తగ్గింది?

- టీటీడీని కలవరపెడుతున్న భక్తుల అసంతృప్తి
- ఆర్గానిక్ ధాన్యం వాడకంపై పునఃసమీక్ష

శ్రీవారి లడ్డూప్రసాదానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో, ఆలయంలో వితరణ చేసే అన్నప్రసాదాలకూ అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతినిత్యం త్రికాల నైవేద్యం పేరుతో శ్రీవారికి రోజుకు మూడు పూటలా నైవేద్య సమర్పించడం ఆనవాయితీ. ఇందులో నైవేద్య సమర్పణ సమయాన్ని మొదటి గంట, రెండో గంట, మూడో గంటగా వ్యవహరిస్తారు. తొలి నివేదన ఉదయం 5.30కు, రెండో నివేదన ఉదయం 10 గంటలకు, రాత్రి నివేదన 7.30 గంటలకు సమర్పిస్తారు. వారపు సేవలను బట్టి నివేదన సమర్పణ సమయం మారుతుంటుంది. స్వామి నివేదించే ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూ, వడ, సీరా, దోశ, ప్రసాదాలతోపాటు చక్కెరపొంగళి, కదంబం, పులిహోర, దద్దోజనం, మిరియాల పొంగలి, సేకరాబాత్, మొలహోరా వంటి అన్నప్రసాదాలూ ఉంటాయి. వీటిని ఆలయంలోని బంగారువాకిలికి ఆగ్నేయదిశగా ఉన్న పోటులో శ్రీవైష్ణవులు పవిత్రంగా ఇప్పటికీ కట్టెల పొయ్యలపైనే తయారు చేస్తున్నారు. ప్రతి ప్రసాదాన్ని ఒక్కో గంగాళంలో తీసుకెళ్లి మూలవర్లకు నివేదించడం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కొవిడ్ తర్వాత భక్తులకు దూరమైన ప్రసాదాలు

కొవిడ్ తర్వాత తిరుమలలో స్వామికి సమర్పించే అన్నప్రసాదాల్లో తేడా మొదలైంది. రుచి తగ్గిపోవడంతోపాటూ, తయారు చేసే ప్రసాదాల పరిమాణం తగ్గిపోయింది. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థం కాదు. గతంలో స్వామి దర్శనానికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ బయటకు రాగానే చక్కెర పొంగలో, పులిహోరో, దద్దోజనమో దొన్నెలో పెట్టి చేతికిచ్చేవారు. ఇప్పుడు వీఐపీలకు తప్ప అన్నప్రసాదాలు అందడం లేదు. ఇందుకు కారణం - అన్నప్రసాదాల తయారీ బాగా తగ్గించేయడమే. గతంలో స్వామికి నివేదించేందుకు ప్రతిరోజు 29 గంగాళాల అన్నప్రసాదాలు తయారు చేసేవారు. శుక్రవారం అభిషేకం సందర్భంగా 40 గంగాళాలు సమర్పిస్తే, గురువారం తిరుప్పావై సేవకు 29 గంగాళాలకు అదనంగా మరో 40 గంగాళాల అన్నప్రసాదాలను స్వామికి సమర్పించేవారు. దర్శనానంతరం భక్తులకు పంచడానికి వీలుగా రోజూ మరో 60గంగాళాల ప్రసాదాలు చేసేవారు. ఇందువల్ల రోజూ 25-30 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందేవి.

ఇప్పుడు ఇలా...

కొవిడ్ సమయంలో భక్తులు ఉండరు కాబట్టి అదనపు ప్రసాదాల తయారీని తగ్గించి కేవలం స్వామికి మాత్రమే సమర్పిస్తూ వచ్చారు. ఆతర్వాత భక్తుల సంఖ్య నెమ్మదిగా పెరిగినప్పటికీ దీన్నే కొనసాగించేశారు. వాటి పరిమాణం కూడా దారుణంగా తగ్గించేశారు. పైగా ఆర్గానిక్ పదార్థాలతో తయారు చేసిన అన్నప్రసాదాలనే స్వామికి నివేదించడం మొదలుపెట్టారు. గోఆధారిత వ్యవసాయంతో పండించిన పంటలతోనే గోవిందునికి నైవేద్యం సమర్పించే విధానం 2022 అక్టోబరు నుంచి అమలు అవుతోంది. రోజుకు కేవలం 204 కిలోల దేశీయ బియ్యంతో చేసిన అన్నప్రసాదాలను మాత్రమే స్వామికి ప్రస్తుతం నివేదిస్తున్నారు. దీంతో ఇవి సాధారణ భక్తుల దాకా రావడం లేదు. అధికారులు, వీఐపీలకే సరిపోతున్నాయి.

రుచి తగ్గడానికి కారణాలేమిటి?

బహురూపి, నారాయణకామిని, రత్నచోళి, కాలాబట్, చింతలూరి సన్నం, చిట్టిముత్యాలు, ఎర్రబంగారం వంటి దేశీయ వరిబియ్యంతోనే అన్నప్రసాదాలను వండుతున్నారు. ఈ అన్నప్రసాదాల రుచిపై తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. మునుపటి అన్నప్రసాదాలతో పోల్చుకుని అందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా త్వరగా పాడైపోతున్నాయి కూడా. నిజానికి సేంద్రియ పదార్థాలతో చేసిన వంటల రుచి భిన్నంగా ఉంటుంది. వీటిని వండే పద్ధతి కూడా మారుతుంది. ముడి బియ్యం వాడుతుంటే ఎక్కువ సేపు నానబెట్టడం వంటివి చేయాలి. సేంద్రియ ధాన్యాలతో రకరకాల వంటలు రుచిగా ఎలా చేయవచ్చో అనేక పుస్తకాలు కూడా విడుదలయ్యాయి. ప్రత్యేకంగా రెస్టారెంట్లే నడుస్తున్నాయి. వీటిని ఇష్టపడి మరీ తింటున్నారు. మరి టీటీడీ చేస్తున్న అన్నప్రసాదాలు మాత్రం ఎందుకు రుచిగా లేవన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీఐపీల నుంచి కూడా విమర్శలు పెరగడంతో టీటీడీ అధికారులు పూర్వపు విధానమే అనుసరించాలా అనే చర్చ కూడా చేస్తున్నారు. సాధారణ సన్న బియ్యంతోనే అన్నప్రసాదాలు తయారు చేయాలా లేక గోఆధారిత ఉత్పత్తులతోనే కొనసాగించాలా అనే అంశంపై కొత్తగా పాలక పగ్గాలు చేపట్టిన అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందుకుసంబంధించిన నిపుణుల సూచనలు కూడా కోరుతున్నారు. మునుపటిలా అందరికీ అందేలా అన్నప్రసాదాల తయారీ పరిమాణం కూడా పెంచాలని భక్తులు కోరుతున్నారు.







జలమయం

తిరుపతిలో దంచికొట్టిన వాన

తిరుపతి మధురానగర్‌లో మోకాటి లోతు నీళ్లు, ఇళ్లలోకీ చేరిన వర్షపునీరు

తిరుపతి అర్బన్, ఆగస్టు 10: తిరుపతిలో శనివారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. పెద్ద పెద్ద చినుకులతో ప్రారంభమై దాదాపు గంటపాటు కుండపోత వర్షం కురిసింది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు తడిచి ముద్దయ్యారు. నగరంలోని మధురానగర్‌లోని ఇళ్లలోకీ నీరు చేరాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.

బలి తీసుకున్న బతుకు బండి!

- ట్రాక్టరు కింద నిద్రించిన డ్రైవర్
- చూసుకోకుండా వాహనాన్ని అతడిపై ఎక్కించేసిన యజమాని
- తీవ్రగాయాలతో యువకుడి మృతి



గుణశేఖర్(ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఆగస్టు 10: తల్లిదండ్రులు లేకపోయినా ట్రాక్టర్ డ్రైవర్‌గా ఆ యువకుడు జీవనం సాగించేవాడు. బతుకునిచ్చిన బండి కింద అలసటతో ఆదమరచి నిద్రించాడు. దీన్ని యజమాని చూసుకోకుండా ట్రాక్టర్‌ను నడపడంతో బతుకుబండే ఆ యువకుడిని బలి తీసుకున్న విషాద సంఘటన తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ మండలం భవానీశంకరాపురానికి చెందిన గుణశేఖర్(20)కు బాల్యంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దాంతో బంధువుల సంరక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక తొట్టంబేడు మండలం రౌతుసూరమాల వద్ద గ్రావెల్ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం వేళ విరామ సమయంలో ట్రాక్టర్ కింద నీడలో సేద తీరేవాడు. శనివారం కూడా తన ట్రాక్టర్ ట్రాలీ కింది నిద్రించాడు. దీన్ని గమనించని ట్రాక్టర్ యజమాని ఆ వాహనాన్ని నడపడంతో దానికింద ఉన్న గుణశేఖర్‌పైకి ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. గుణశేఖర్‌కు సమీప బంధువు బత్తెయ్య తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరసిద్ధుడి ఆలయంలో రద్దీ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 10: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలలో భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కొండపై భద్రతా లోపాలు ఉండకూడదు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా భద్రతా లోపాలు ఉండకూడదని విజిలెన్స్ అధికారులను టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ ఆదేశించారు. సీవీఎస్వోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇప్పటికే టీటీడీలో భద్రత అంశాలపై పలు సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాలనూ క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు రానున్న నేపథ్యంలో వాహనసేవలు వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగానే శనివారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మాడవీధులు, ఎలిఫెంట్ గేట్ వద్ద క్యూలైన్లను, ఆలయంలోని ప్రసాదాల పోటు, ముడి సరుకులు నిల్వ ఉంచే ఉగ్రాణాన్ని పరిశీలించారు. ఆలయం పైభాగంలో ఉండే ఏఆర్ సెక్యూరిటీ సిబ్బంది పాయింట్లు, గొల్లమండపంపై ఉన్న సెక్యూరిటీ పాయింట్లను పరిశీలించారు. గతంలో బ్రహ్మోత్సవాల నిర్వహణ, భద్రత ఏర్పాటు, బందోబస్తు వంటి అంశాలపై అవగాహన చేసుకోవడంతోపాటు కొన్ని సూచనలు చేశారు. వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో గిరిధర్, వీఐలు తదితరులు ఉన్నారు.



మాడవీధులను పరిశీలిస్తున్న శ్రీధర్

ఫుడ్ ప్రాసెసింగ్‌లో మహిళలు రాణించాలి

ఏర్పేడు, ఆగస్టు 10: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తిరుపతి ఐఐటీ డీన్, క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ (సీఐసీ) సీఈవో రాఘవరావు అన్నారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో శనివారం ఎంఎస్ఎంఈ (ఎంవోఎఫ్ఐ), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్తంగా జిల్లాలోని మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండ్రోజుల తరగతులను శుక్రవారం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ జోనల్ మేనేజరు సాయి శ్రీనివాస్ ప్రారంభించిన విషయం తెలిసిందే. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా, రేణుకా బయోఫామ్స్ ఎండీ ఎస్.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డీఆర్పీ ఎ.ప్రసాద్, తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీ ఇంజనీరింగ్ పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

టీటీడీ ఇంజనీరింగ్ ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు!

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా, అవసరానికి మించి నిధులు కేటాయించారంటూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. రాజకీయ లబ్ధికోసం గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇంజనీరింగ్ పనులకు వందల కోట్ల రూపాయలు కేటాయించిందని, అవసరం లేకున్నా రోడ్లు వేశారని, కమీషన్ల కోసం శ్రీవారికి చెందిన కోట్లాది రూపాయలు ఖర్చు చేశారంటూ తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రత్యేకంగా స్టేట్ విజిలెన్స్ బృందాలను తిరుపతికి పంపింది. వారు సుమారు రెండు నెలలపాటు ఇంజనీరింగ్ విభాగం మాత్రమే కాకుండా పలు కీలకమైన విభాగాల్లోనూ సోదాలు చేశారు. ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పలువురు అధికారులు, ఉద్యోగులను విచారించారు. వారి వద్దనుంచి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేశారు. స్వయంగా అన్నింటినీ పరిశీలించారు. ఈక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన, చేస్తున్న దాదాపు 58 మంది అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ బోర్డు తీర్మానాలను ఎందుకు వ్యతిరేకించలేదంటూ నోటీసుల్లో పేర్కొన్నట్టు తెలిసింది. త్వరలో కొందరిపై చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే మిగిలిన విభాగాల అధికారులు, ఉద్యోగులకూ త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

తిరుమలలో 15 నుంచి పవిత్రోత్సవాలు

తిరుమల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికులు, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు కలుగుతుంటాయి. ఈక్రమంలో వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962 నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను తిరిగి ప్రారంభించింది. ఉత్సవాల్లో భాగంగా మూడ్రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 15న పవిత్ర ప్రతిష్ఠ, 16న పవిత్ర సమర్పణ, చివరిరోజు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

ఆర్జిత సేవలు రద్దు

పవిత్రోత్సవాల్లో భాగంగా ఈనెల 14న అంకురార్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అలాగే 15న తిరుప్పావడ, 15 నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. 18వ తేదీ కూడా కల్యాణోత్సవాన్ని రద్దు చేశారు.

గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

తిరుపతి(విద్య), ఆగస్టు 10: గిరిజన అభ్యర్థులకు ఉచితంగా భోజన వసతితోపాటు డీఎస్సీ శిక్షణను ఉచితంగా అందించనున్నట్టు తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ, సాధికరిత అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వంద మంది గిరిజన అభ్యర్థులకు ఈ అవకాశం ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు తిరుపతి కలెక్టరేట్‌లోని బీ బ్లాక్, 5వ అంతస్తులోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం లేదా సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్య (సెల్ నెంబరు: 94935 24121)ను సంప్రదించవచ్చని సూచించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకూ నీరిస్తాం

- జడ్పీ సమావేశంలో తీర్మానం
- ఇరిగేషన్ సమస్యలపై సభ్యుల ఏకరువు
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం
- రానున్న రెండేళ్లలోనైనా మంచి పనులు చేయండి
- సభ్యులకు మంత్రి ఆనం పిలుపు
- ఎరువులు, విత్తన కొరత రానివ్వం
- శీతల గిడ్డంగుల నిర్మాణానికి చర్యలు : నారాయణ



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , పక్కన మరో మంత్రి నారాయణ, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి/స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 10: నెల్లూరు జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిండుగా కనిపించింది. హుందాగా సాగింది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో సహా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. నీటిపారుదల శాఖపైనే ప్రధాన చర్చ జరగ్గా, ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలని సమావేశం తీర్మానించింది. పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు తమ ప్రాంతాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. అధిక శాతం మంది సభ్యులు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను సామూహికంగా కాకుండా వ్యక్తిగతంగా ఇవ్వాలని కోరారు.

● వైసీపీ వర్సర్స్ డీఈవో

విద్యాశాఖపై చర్చ జరుగుతున్న సమయంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు అసలు డీఈవో ఫోన్ కూడా లిఫ్ట్ చేయరంటూ మండిపడ్డారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుల అడ్జస్ట్‌మెంట్లు, నూతన భవన నిర్మాణాలు, కేఎస్‌ఆర్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి అంశాలపై ప్రశ్నించారు. డీఈవో రామారావు సమాధానం ఇస్తుండగా ఒక్క ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేకున్నారంటూ ఆగ్రహించారు. అదే సమయంలో మరో ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి స్కూల్ కమిటీ ఎన్నికల్లో అవకతవకలు జరిగుతున్నా ఎందుకు స్పందించలేదని డీఈవోను ప్రశ్నించారు. వెంటనే జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సైతం తాను ఫోన్ చేసినా మీరు లిఫ్ట్ చేయడం లేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీరు (డీఈవో) విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ప్రభుత్వం మీకు ఊరికే జీతాలు ఇస్తుంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వైసీపీ నాయకులు, డీఈవో మధ్య అర్ధగంటపాటు వాడివేడి వాదనలు జరిగాయి. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయానికే పెద్ద పీట : మంత్రి నారాయణ

చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయ రంగానికే పెద్ద పీట వేస్తోందని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించి రైతుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అధికారులు మండల సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలని, ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, అలాగే వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం అన్ని మండల కేంద్రాల్లో శీతల గిడ్డంగులు నిర్మాణానికి, ఉద్యాన పంటల్లో కొబ్బరిని జోడించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో కొబ్బరి సాగు పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంట కాలువల్లో పూడిక తీత తీయిస్తామని, ఆయకట్టు స్థిరీకరణ చేపడతామని నారాయణ స్పష్టం చేశారు.

'ఆల్తూరుపాడు' పనులు చేస్తారా!? లేదా!?



ఆల్తూరుపాడు రిజర్వాయర్ కోసం రైతుల నుంచి 250 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా ప్రాజెక్టు కట్టలే. రైతులకు పైసా కూడా పరిహారం ఇవ్వలేదు. ఇటు నగదు అందక, అటు సేద్యం చేయలేక ఆ రైతులను బతకమంటరా!? చావమంటారా!? ఆ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులను నిలుపుదల చేయాలి.

\- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే

అభివృద్ధి కోసం కలిసి రండి : మంత్రి ఆనం

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి సమావేశాలలో స్థానిక సమస్యలపై చర్చలు జరగాలని, అక్కడ నుంచి జడ్పీ సమావేశానికి ఆ అంశాలను తీసుకొని రావాలని సూచించారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి కాంట్రాక్టరు, ఎంపీ ఒక్కరే అని ఆయన పనులు ఆపేసి వెళ్లిపోయారన్నారు. ఇవాళ ఆ బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడిందన్నారు. గతంలో ఇరిగేషన్ మినిస్టర్ రివర్స్‌టెండర్ తెచ్చింది తానేనంటూ అసెంబ్లీలో జబ్బలు చరుచుకొని మాట్లాడారని, రివర్స్‌టెండర్ వల్ల ప్రభుత్వానికి 28 శాతం నిధులు మిగిలాయన్నారని అయితే పని జరిగిందా అంటే గతం కంటే ప్రస్తుతం రెండింతలు ఎస్టిమేషన్ పెరిగిందని చెప్పారు. తెలుగు గంగ కాలువ రాకపోవడంతో మీ ప్రాంతంలో రైతులు ఎంత నష్టపోయారో డక్కిలి, వెంకటగిరి, బాలయ్యపల్లి జడ్పీటీసీ, ఎమ్పీటీసీలు ఆలోచించాలి. ఐదేళ్లలో ఎందుకు ఆ పనులు చేయలేక పోయామో సమాధానం చెప్పాలి. గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి అందరూ పని చేయండి. మిగిలిపోయిన పనులను కనీసం రానున్న రెండేళ్లలో పూర్తి చేసేలా కష్టపడాలి. వచ్చేది వర్షాకాలం రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో అంతా కలిసి ముందుకు రావాలి. మూడేళ్ల క్రితం సోమశిల ప్రాజెక్ట్ గేట్లు, పక్కనే ఉన్న సోమేశ్వరస్వామి ఆలయం విగ్రహం కిలోమీటరు కొట్టుకు పోతే పట్టించుకోలేదు. సోమశిల బాగు చేయాలని పదే పదే కోరితే నన్ను అనర్హుడును చేశారే తప్ప గత ప్రభుత్వం సోమశిలను బాగుపరచడంలో ఒక్క ఆలోచన కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండవ వారమే ఇరిగేషన్ శాఖ మంత్రిని జిల్లాకు తీసుకువచ్చి ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో కలిసి సోమశిలకు వెళ్లి ప్రాజెక్టు మరమతులు చేయాలని కోరాము. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించుకొని రూ.9 కోట్ల నిధులు ముఖ్యమంత్రి ఆదేశాలతో మంజూరు చేసేందుకు రికార్డులు సిద్ధం చేశాం. ఇవాళ వైసీపీ వైఫల్యాలను ఎత్తి చూపాలంటే సాయంత్రం 6 గంటల వరకు చెబుతానే ఉంటా"నన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

● కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతి

పెళ్లకూరు ఆగస్టు10: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదని, అలాంటి పంచాయతీల అభి వృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం గుంటూరులోని కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో ఆధ్వర్యంలో పెమ్మసానిని కలసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వంట మాస్టర్ మృతి

బాలాయపల్లి, ఆగస్టు 10: మండల పరిధిలోని నిండలిలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. నిండలి గ్రామానికి చెందిన చంద్రబాబు తిరుపతిలో వంట మాస్టర్‌గా పనిచేసేవాడు. ఎన్నికల ముందు స్వగ్రామానికి వచ్చి ఇల్లు కట్టుకుని శుక్రవారం గృహప్రవేశం చేశారు. ఏమైందో కానీ నిండలి చెరువు కల్వర్టు వద్ద ఆయన అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం శవాన్ని వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి ఉంచాలి

ఓజిలి, ఆగస్టు 10 : అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన, పరిసరాల శుభ్రతను విధిగా పాటించాలని ఓజిలి ఎంఈవో శైలజ అన్నారు. శనివారం ఓజిలిలోని విద్యా వనరుల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్ఎంసీల ఏర్పాటు పూర్తయిందని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్ఎంసీ కమిటీలతో కలిసి సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

తగ్గిన చికెన్ ధరలు

గూడూరు అర్బన్, ఆగస్టు 10: కొద్దిరోజులుగా చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. మూడు వారాల క్రితం రూ.300 వరకు ఉన్న కేజీ చికెన్ ప్రస్తుతం చికెన్ ధర సగానికి పడిపోయి రూ. 150 చేరింది. శ్రావణమాసం రావడంతోపాటు చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు అంటున్నారు. ఓ వైపు శ్రావణ మాస ప్రత్యేక పూజల్లో ఆలయాలు రద్దీగా ఉండగా.. చికెన్ దుకాణాలు విక్రయదారులతో కళకళలాడుతున్నాయి. వ్యాపారుల మధ్య పోటీ ఉన్న ప్రాంతాల్లో గరిష్ఠంగా రూ. 120 కూడా విక్రయాలు జరుగుతున్నట్లు ఆయా ప్రాంతాల మాంసప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నారా లోకేశ్‌ను కలసిన తెలుగుయువత ఉపాధ్యక్షుడు

నాయుడుపేట, ఆగస్టు 10 : రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌బాబును తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో శనివారం కలసినట్లు పరసారాజా తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 10: స్థానిక రోటరీభవన్‌లో శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పేదల కు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ నిరాధరణకు గురైన వృద్ధులకు చేయూతనందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, దశరథ రామిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



పెళ్లకూరు ఆగస్టు 10 : మండలం లోని అక్కగారిపేటలో శుక్రవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. స్థానికులు సమాచారం మేరకు ఈ గ్రామంలోని ఇలుపూరు సంతోష్‌కుమార్ ఇంట్లో చోరీ చేసేందుకు శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి చొరబడ్డాడు. సంతోష్‌కుమార్ గమనించి కేకలు వేయడంతో పరారయ్యాడు. చుట్టుపక్కల వారు దొంగను పట్టుకుని తాడుతో కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒడిశా రాష్టానికి చెందిన వాడని, అతడికి మతిస్థిమితం లేదని పోలీసులు తెలిపారు.

జీడిమామిడి, వేరుశనగ పంటలపై సర్వే

కోట, ఆగస్టు10 : మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల గున్నంపడియా, యమదిన్నెపాళెం, చిల్లకూరు మండలం లింగవరం పంచాయతీ పల్లెవానిదిబ్బ సమీపంలో శనివారం పలుశాఖల అధికారులు పంటల సర్వే చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రమణయ్య, సర్వేయర్ రామ్‌కుమార్‌తోపాటు అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. ఇక్కడ ఉన్న 24 ఎకరాల ప్రభుత్వ భూములు చెన్నై, బెంగుళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌లో వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 24 ఎకరాల భూములు సర్వేలో తమపేర్లు నమోదుచేయాలని చిల్లకూరు మండలం పల్లెవానిదిబ్బ వాసులు అధికారులతో వాదోపవాదాలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దారు జయజయరావు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పలుశాఖల అధ్యయన బృందాలు పంటలసాగుపై సర్వే నిర్వహించారు.

జగన్ పేరు తొలగింపుపై వైసీపీ నానాయాగీ

వాకాడు, ఆగస్టు 10 : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఆగంతకులు తొలగిస్తే వైసీపీ నేతలు నానాయాగీ చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు నందగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని స్వర్ణముఖి గెస్ట్‌హౌస్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాకాడు మండలంలో గత 5 సంవత్సరాలు వైసీపీ విధ్వంస పాలన చేసిందన్నారు. గతంలో గూడూరు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి భిన్నంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రాజకీయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, తీపలపూడి రమణయ్య, బుజగేంద్ర, తుమ్మల మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాకుంభాభిషేకాలు



కోట, ఆగస్టు 10 : కోట పట్టణ పరిధి లోని శ్యామసుందర పురంలో గల అంకాళ పరమేశ్వరి అమ్మవారి మహాకుంభాభిషేకా లలో భాగంగా రెండవ రోజు శనివారం కలశ పూజ జరిగింది. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి-కవితమ్మ దంపతులతోపాటు గూడిపాకల సుబ్బారావు ఆధ్వర్యంలో కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మేళ తాళాలు, వేదమంత్రాల నడుమ కలశపూజలు జరిగాయి.

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కోట, ఆగస్టు 10 : మండల పరిధిలోని చిట్టేడు, లక్ష్మమ్మకాలనీ, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష్మమ్మకాలనీలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది.

సమస్యలపై నిరంతర పోరాటం : యూటీఎఫ్



గూడూరు, వెంకటగిరిలలో పతాకావిష్కరణ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, సూళ్లూరుపేటలో బైక్‌ర్యాలీ

గూడూరు, ఆగస్టు 10: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతర పోరాటాలు సాగిస్తుందని యూటీఎఫ్ నాయకులు సుధీర్, హరిబాబు అన్నారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవన సమీపంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఓ వైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, పాఠశాల పరిరక్షణ కోసం, విద్యాప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వాసుదేవరావు, నాగేశ్వరరావు, రవి, మురళీసింగ్, గురునాథం, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించిందని జిల్లా కార్యదర్శి కుమారస్వామి అన్నారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ, రత్నశేఖర్, గంగారావు, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీరాములు, సుధీర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : రాష్ట్ర యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బైక్ ర్యాలీ జరిగింది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలశాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ అనేక పోరాటాలతోనే ఉపాధ్యాయుల సంక్షేమం మెరుగుపడిందని, విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. జీవో నంబరు 117ను రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రీనివాసులు, సునీల్, బాబు, సీఐటీయూ నాయ కులు పద్మనాభయ్య, సుధాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆ సంఘ జెండాను ఎగురవేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరులో కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివప్రసాద్, ప్రభుదాస్, శ్రీనివాసులు, వాసు, శంకరయ్య, శేఖర్, రామమూర్తి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 10: సూళ్లూరుపేట పట్టణ అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్‌ను కోరారు. శనివారం శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్‌ను ఎమ్మెల్యే కలుసుకుని శాలువాతో సత్కరించారు. వచ్చే వారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శ్రీహరికోటకు రానున్న నేపథ్యంలో పర్యటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట అభివృద్ధికి తగినంత సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, బొమ్మన ఫణి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, సెల్వం, కిషోర్ ఉన్నారు.



షార్ డైరెక్టర్ ఆర్ముగంరాజరాజన్ తదితరులతో ఎమ్మెల్యే విజయశ్రీ

భార్య, బావమరిదిపై భర్త దాడి

ఆస్పత్రికి తరలిస్తుండగా బావమరిది మృతి





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి (ఇన్‌సెట్‌లో) మృతుడు జాకీర్ (ఫైల్ ఫొటో)

గూడూరు, ఆగస్టు 10: కుటుంబ కలహాల నేపథ్యంలో స్థానిక బనిగీసాహెబ్‌పేటలో భార్య, బావమరిదిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో బావమరిది మృతిచెందిన ఘటన శనివారం గూడూరులో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక మసీదువీధికి చెందిన సోనియాతో బనిగీసాహెబ్‌పేటకు చెందిన అల్లాబక్షుకు కొంతకాలం క్రితం వివాహమైంది. అల్లాభక్షు ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి కాపురంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోనియా అత్తగారి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. సమీపంలోనే అల్లాభక్షు వేరే ఇంట్లో తన తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో సోనియా సోదరులైన జాకీర్(28) కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తుండగా, షాకీర్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. వీరిద్దరూ సోదరి ఇంటికి మాట్లాడేందుకు శనివారం వచ్చారు. దీనిని గమనించిన అల్లాభక్షు, అతడి తల్లిదండ్రులు చాన్‌బాషా, షర్మిల మాట్లాడేందుకు సోనియా ఇంటి వద్దకు వచ్చారు. మాటామాటా పెరగడంతో వివాదానికి దారితీసింది. దీంతో అల్లాభక్షు, అతడి తల్లిదండ్రులు అక్కడ ఉన్న రోకలిబండతో సోనియా, ఆమె సోదరులపై దాడి చేశారు. ఈ దాడిలో సోనియా, జాకీర్‌లు తీవ్రగాయాలపాలయ్యారు. షాకీర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వీరిని చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సోనియాను, జాకీర్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యంలో జాకీర్ మృతిచెందాడు. సోనియా నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతోంది. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోపాటు ఉపాధి అవకాశాలు

గూడూరు, ఆగస్టు 10: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శనివారం ఆ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పించాలని వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ మేళాలో 33 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 1845 మంది విద్యార్థులు పాల్గొనగా 532 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వంకి అనూష, అరవింద, ప్రిన్సిపాల్ డాక్టర్ మురుగదాస్, కిరణ్‌కుమార్, సురేష్, డాక్టర్ మురళి, డాక్టర్ వేణుమాధవ్, రామయ్య పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో వంకి పెంచలయ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు

దుస్తుల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 10: మండల పరిధి నెలబల్లిరెట్టపల్లిలోని గిరిజన కాలనీవాసులకు శనివారం పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ పొతుగుం మల్లికార్జున్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌బాబు, రమణారెడ్డి పాల్గొన్నారు.

సుందరమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, ఆగస్టు 10: చిల్లకూరు దళితవాడలోని గ్రామ దేవత సుందరమ్మకు శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం, శనివారం, ఆదివారం మూడురోజులపాటు జరిగే తిరునాళ్లలో భాగంగా రెండో రోజు అమ్మవారి ఆలయంలో హోమపూజలు, కుంకుమార్చన జరిగాయి. టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 10: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాన కార్యక్రమం

గూడూరు అర్బన్, ఆగస్టు 10: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కే.చంద్రశేఖర్, సురేష్‌రెడ్డి, రాధయ్య, కరీముల్లా, ప్రభాకర్, సతీష్, కళ్యాణి పాల్గొన్నారు.

యథాస్థానాలకు ఎంపీడీవోల బదిలీ

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 10 : ఎన్నికల విధుల కోసం జిల్లా నుంచి తాత్కాలిక బదిలీపై వెళ్లిన ఎమ్పీడీవోలను యదాస్థానాలకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నిలకు ముందు 31మంది ఎమ్పీడీవోలను ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఎన్నికలు ముగిసి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటంతో బదిలీపై వెళ్లిన వారందరినీ జిల్లాకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిలో 25 మందికి గతంలో పనిచేసిన మండలాలనే కేటాయిస్తూ జడ్పీ సీఈవో కన్నమ్మనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీడీవో పేరు	కేంద్రం
పీవీ.నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం
ఎం.బ్రహ్మయ్య	కొండాపురం
బి.సింగయ్య	డీవీ సత్రం
ఎం.గోపి	సంగం
పి.ప్రవీణ్	ఆత్మకూరు
ఎం. భాస్కర్	ఏఎస్‌పేట
ఎ.మధుసూదనరావు	అనంతసాగరం
కె.నాగేంద్రబాబు	ఇందుకూరుపేట
కె.ప్రత్యూష	ముత్తుకూరు
జి. వెంకటేశ్వర్లు	మనుబోలు
వివి. సూర్యసాయి	చిల్లకూరు
ఎం. భవాని	కోట
కె. సాలెట్	చిట్టమూరు
కె.సురేష్‌బాబు	పెళ్లకూరు
పి.ప్రసన్నకుమారి	డక్కిలి
ఎ.ప్రమీలా రాణి	సూళ్లూరు పేట
టి. నాగేష్ కుమారి	పొదలకూరు
పి.నాగమణి	మర్రిపాడు
ఏవీ.సుబ్బారావు	బోగోలు
ఎం.శ్రీహరి	కోవూరు
పి.సుబ్రహ్మణ్య	కొడవలూరు
వి.రజనీ కాంత్	ఓజిలి
కేవీ. కోటేశ్వరరావు	వెంకటగిరి
కే.గోవర్ధన్	కలువాయి
కె.వెంకటేశ్వరరావు	గూడూరు